
# తెహల్కా

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి వార్త సంచలనం

హైదరాబాద్, విజయవాడ | గురువారం | 16-04-2026 | పేజీలు : 6

తెలంగాణలో భగభగలు

# సూరీడు..

## పలు జిల్లాల్లో 43 డిగ్రీలు దాటిన ఎండలు






- తెలంగాణలో పలు ప్రాంతాల్లో 43 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- రానున్న మూడు రోజుల్లో ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం
- వడగాలులు వీచే జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ
- తెలంగాణలో ఉగ్రరూపం దాల్చిన ఎండలు.. రానున్న 5 రోజులు కీలకం
- నల్గొండ జిల్లాలో అత్యధికంగా 43.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- పలు జిల్లాల్లో 42 డిగ్రీలు దాటిన పగటి ఉష్ణోగ్రతలు
- రానున్న ఐదు రోజుల్లో 45 డిగ్రీలు దాటే అవకాశం
- వాతావరణ శాఖ నుంచి ప్రజలకు హెచ్చరిక

తెలంగాణలో భానుడు ఉగ్రరూపం ప్రదర్శిస్తున్నాడు. రాష్ట్రవ్యాప్తంగా ఎండలు మండిపోతుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఏప్రిల్ మధ్యలోనే ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. మంగళవారం నాటి వాతావరణ శాఖ నివేదికల ప్రకారం నల్గొండ జిల్లా అడవి దేవులపల్లి మండలంలో అత్యధికంగా 43.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. జగిత్యాల జిల్లా కోరుట్లలో 43.4 డిగ్రీలు, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో 43.3 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. ఆదిలాబాద్‌లో 43.2 డిగ్రీలు నమోదు కాగా, సిద్దిపేట, కామారెడ్డి, కరీంనగర్, మంచిర్యాల, సిరిసిల్ల, సంగారెడ్డి జిల్లాల్లో కూడా పగటి ఉష్ణోగ్రతలు 42.8 డిగ్రీలకు పైగా ఉన్నాయి. ఉదయం 8 గంటల నుంచే ఎండ తీవ్రత ప్రారంభమై మధ్యాహ్నానికి గరిష్ఠ స్థాయికి చేరుకుంటోంది. తీవ్రమైన ఎండలకు తోడు ఉక్కపోత కూడా అధికంగా ఉండటంతో జనం ఇళ్లకే పరిమితమవుతున్నారు.


2



2లో

## డీలిమిటేషన్‌పై దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన చెందాల్సిన పనిలేదు : కేంద్రం

- లోక్‌సభలో అన్ని రాష్ట్రాల వాటాను ఏకరీతిగా 50శాతం పెంచనున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడి
- అన్ని పార్టీలతో మాట్లాడిన తర్వాతే ఒక నిర్ణయం : నిర్మలా సీతారామన్
- ఖర్గే నివాసంలో కాంగ్రెస్ కీలక సమావేశం



2లో

## 'ఈ 9 పనులు చేస్తామంటూ ప్రతిజ్ఞ తీసుకోవాలి'- ప్రజలకు ప్రధాని మోదీ విజ్ఞప్తి

### నియోజకవర్గాల పునర్విభజన బిల్లును వ్యతిరేకిస్తున్నాం-

## రాజకీయ లబ్ధి కోసం కేంద్రం ప్రయత్నం : ఖర్గే

- మహిళా రిజర్వేషన్ బిల్లుకు మేం మద్దతు ఇస్తున్నాం
- బిల్లు ప్రవేశపెడుతున్న విధానంపైనే మాకు అభ్యంతరం
- రాజకీయ దురుద్దేశంతో ఈ బిల్లు తెస్తున్నారు
- బిల్లుకు వ్యతిరేకంగా విపక్షాలన్నీ పోరాడుతాయి: ఖర్గే



2

## 'మన తలలపై వేలాడుతున్న కత్తి మనపైనే పడింది'- డీలిమిటేషన్‌పై స్టాలిన్ ఫైర్



- డీలిమిటేషన్‌పై భగ్గుమన్న తమిళనాడు సీఎం
- తమిళనాడు సహా దక్షిణాది రాష్ట్రాలకు చారిత్రక అన్యాయం వెల్లడి
- బీజేపీ భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తుందని వ్యాఖ్య
- ఏప్రిల్ 16న నల్లజెండాలతో నిరసనకు పిలుపు



2లో

## మహిళా రిజర్వేషన్ బిల్లుకు కేసీఆర్ పూర్తి మద్దతు.. డీలిమిటేషన్‌పై వార్నింగ్

- పార్టీ ముఖ్య నేతలతో మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్‌పై కేసీఆర్ చర్చ
- మహిళా రిజర్వేషన్లకు అనుకూలంగా గతంలోనే తీర్మానం చేశామన్న కేసీఆర్
- డీలిమిటేషన్ కారణంగా దక్షిణాదికి ఇప్పుడున్న 24 శాతం సీట్లు తగ్గకూడదని వార్నింగ్

### అదే జరిగితే కేసీఆర్ ముందుండి ఉద్యమాన్ని నడిపిస్తారు:

## బీజేపీకి కేటీఆర్ హెచ్చరిక



2లో

- మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతిస్తామన్న కేటీఆర్
- డీలిమిటేషన్ బిల్లు పేరుతో దక్షిణాదికి అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరిక
- బీజేపీ తెలంగాణకు ఎప్పుడూ మంచి చేయదని విమర్శ

## బలవంతపు భూసేకరణ ఆపకపోతే ఉద్యమం ఉద్ధృతం: వికారాబాద్‌లో కల్వకుంట్ల కవిత గర్జన

- పరిగి ప్రాంత రైతుల నుంచి సాగు భూములను లాక్కుంటున్నారంటూ కవిత ధర్నా
- అన్నదాతల పొట్ట కొట్టడం అన్యాయమని వ్యాఖ్య
- రైతుల సమ్మతి లేకుండా ఒక్క ఎకరా భూమి కూడా తీసుకోవడానికి వీల్లేదన్న కవిత



2లో



## 24 ఏళ్లలో మోదీపై ఒక్క అవినీతి మచ్చ లేదు

### - టీఎంసీ దోచుకున్న ప్రతి పైసా తిరిగి వసూలు చేస్తాం: అమిత్ షా

బంగాల్‌లో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తృణమూల్ కాంగ్రెస్ దోచుకున్న ప్రతి పైసాను వడ్డీతో సహా తిరిగి వసూలు చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా హామీ ఇచ్చారు. 24 ఏళ్లుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికారంలో ఉన్నప్పటికీ, ఆయనపై ఒక్క అవినీతి ఆరోపణ కూడా లేదని ఆయన పేర్కొన్నారు. బుధవారం ఉత్తర బంగాల్‌లోని జల్పాయ్‌గుడి జిల్లా రాజ్‌గంజ్‌లోని ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. "ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అధికారం నుంచి వైదొలగడం ఖాయం. ఆ ప్రక్రియను ప్రారంభించే బాధ్యత ఇక్కడ నుంచే ప్రారంభమవుతుంది.

మిగతా 2లో

### బిహార్ సీఎంగా సమ్రాట్ చౌధరీ ప్రమాణస్వీకారం-

## తొలి బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు



2లో

- నీతీశ్ కుమార్ రాజీనామాతో రాజకీయ మార్పులు
- పట్నా లోక్ భవన్‌లో ఘనంగా ప్రమాణ స్వీకారం
- బీజేపీకి చరిత్రాత్మక తొలి ప్రభుత్వం
- ఉపముఖ్యమంత్రులుగా జేడీయూ నేతలు ప్రమాణం



## రేవంత్ రెడ్డిపై కాంగ్రెస్ పార్టీ పట్టు కోల్పోయింది: జీవన్ రెడ్డి

2లో

# డీలిమిటేషన్‌పై దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన చెందాల్సిన పనిలేదు : కేంద్రం

మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు కోసం చేపట్టే నియోజకవర్గాల పునర్విభజనపై దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్రవర్గాలు తెలిపాయి. లోక్‌సభలో అన్ని రాష్ట్రాల వాటాను ఏకరీతిగా 50శాతం పెంచనున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెప్పినట్లు జాతీయ మీడియా పేర్కొంది. దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన చెందాల్సిన పనిలేదని కేంద్రవర్గాలు పేర్కొన్నాయి. 2011 జనాభా లెక్కలు ఇక్కడ నిర్ణయాత్మక అంశం కావని తెలిపాయి. అంటే దామాషా పరంగా చూస్తే ఎటువంటి మార్పు ఉండదని, ప్రాతినిధ్యం తగ్గుతుందేమోనన్న దక్షిణాది ఆందోళనలను ఈ విధానం నివారిస్తుందని వివరించాయి. దక్షిణాది రాష్ట్రాలకు ఎటువంటి నష్టమూ వాటిల్లదని, ప్రతీ రాష్ట్రానికి కేటాయించిన సీట్ల సంఖ్య కూడా 50 శాతం పెరుగుతుందని స్పష్టం చేశాయి.

**అన్ని పార్టీలతో మాట్లాడిన తర్వాతే ఒక నిర్ణయం : నిర్మలా**

మరోవైపు నియోజకవర్గాల పునర్విభజనను ప్రతిపక్ష కూటమి వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. డీలిమిటేషన్ కమిషన్ ప్రతి రాజకీయ పార్టీని సంప్రదిస్తుందని స్పష్టం చేశారు.

బంగాల్‌లోని పూర్బ బర్ధమాన్‌లో పర్యటించిన ఆమె, ఈ మేరకు ప్రముఖ వార్త సంస్థ ఏఎన్ఐతో మాట్లాడారు. డీలిమిటేషన్ విభజిస్తుందన్న బంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వ్యాఖ్యలపై నిర్మలా సీతారామన్ తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఆమె మహిళలకు రిజర్వేషన్లను ఆపి, బంగాల్ ప్రజల మనసుల్లో భయాన్ని నింపడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. "లోక్‌సభలో సీట్లను 850కి పెంపు అనేది ఒక గరిష్ఠ పరిమితి. ప్రతి రాష్ట్రానికి ఒక డీలిమిటేషన్ కమిటీ ఉంటుంది. అది అన్ని పార్టీలతో మాట్లాడిన తర్వాతే ఒక నిర్ణయం తీసుకుంటుంది. మరి భయం ఎందుకు? మీకు ఎస్ఐఆర్ అంటే భయమా? ఎన్నికల సంఘం, పార్లమెంట్ ఆమోదించిన ప్రతి చట్టం గురించి మీకు భయం. కానీ ఇక్కడ మీరేమీ చేయరు" అని నిర్మలా సీతారామన్ అన్నారు

**ఖర్గే నివాసంలో కాంగ్రెస్ కీలక సమావేశం**

ఇదిలా ఉండగా, పార్లమెంటు ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో మహిళా రిజర్వేషన్ల చట్టానికి సంబంధించిన వ్యూహాన్ని చర్చించేందుకు కాంగ్రెస్ కీలక సమావేశం ఏర్పాటు చేసింది. పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీకి అగ్రనేతలు అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో మహిళా రిజర్వేషన్ల అంశంతో పాటు నియోజకవర్గాల పునర్విభజన అంశంపై కూడా చర్చించారు. కాగా, మహిళా రిజర్వేషన్ల చట్టం, నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం మంగళవారం ఎంపీలకు పంపిణీ చేసింది.

**డీలిమిటేషన్ ప్రక్రియ నిష్పక్షపాతంగా జరగాలి : చిదంబరం**

డీలిమిటేషన్ ప్రక్రియ నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరగాలని కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ, మాజీ కేంద్ర మంత్రి పి. చిదంబరం డిమాండ్ చేశారు. తమిళనాడు కోయంబత్తూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన, లోక్‌సభ సీట్లను 50 శాతం పెంచాలన్న ప్రతిపాదనను ఒక భ్రమగా అభివర్ణించారు. మహిళా రిజర్వేషన్లు, లోక్‌సభ సీట్లను 850కి పెంచే రాజ్యాంగ సవరణను ఆమోదించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల సమయాన్ని ఆయన వ్యతిరేకించారు. తమిళనాడు, బంగాల్‌లో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో పలువురు ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంట్‌కు హాజరు కాలేకపోవచ్చని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం లోక్‌సభలో 543 సీట్లు ఉన్నాయి.

2029 లోక్‌సభ ఎన్నికల నుంచి అమలు చేయాలనే ఉద్దేశంతో, లోక్‌సభ సీట్ల సంఖ్యను 850కి పెంచాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇందులో 815 సీట్లు రాష్ట్రాలకు, మిగిలిన 35 సీట్లు కేంద్రపాలిత ప్రాంతాలకు కేటాయించనున్నట్లు సమాచారం. ఏప్రిల్ 16 నుంచి జరగనున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో రాజ్యాంగ సవరణ బిల్లును తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. లోక్‌సభ సీట్ల సంఖ్యలో 50 శాతం పెరుగుదల ఉండనున్నప్పటికీ, ఈ పెరుగుదల ప్రతి రాష్ట్రానికి జనాభా నిష్పత్తి ఆధారంగా ఉండదని ప్రతిపక్ష పార్టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# 'ఈ 9 పనులు చేస్తామంటూ ప్రతిజ్ఞ తీసుకోవాలి' - ప్రజలకు ప్రధాని మోదీ విజ్ఞప్తి

### నీటి సంరక్షణ, ప్రకృతి వ్యవసాయం నుంచి ఫిట్‌నెస్, సేవ వరకు 9 ప్రతిజ్ఞలు తీసుకోవాలని పిలుపు

ప్రజలందరూ 9 పనులు చేస్తామంటూ ప్రతిజ్ఞ తీసుకోవాలని కోరారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. నీటి సంరక్షణ, ప్రకృతి వ్యవసాయం నుంచి ఫిట్‌నెస్, సేవ వరకు 9 ప్రతిజ్ఞలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి చెందిన కర్ణాటక, భారత్‌ను సాకారం కోసం 9 పనులు చేయాలన్నారు. కర్ణాటక మాండ్య జిల్లాలో పర్యటించిన ప్రధాని నరేంద్ర మోదీ, ఆదిచుంచనగిరి మఠంలో గురు భైరవైక్య మందిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రసంగించిన మోదీ, ఈ మేరకు 9 ప్రతిజ్ఞలు పాటించాలని చెప్పారు.

**మాతృమూర్తి పేరిట మొక్క నాటాలని మోదీ పిలుపు**

ఈ సందర్భంగా మాట్లాడిన మోదీ, మొదటి వాగ్దానంగా జల సంరక్షణను ప్రస్తావించారు. తర్వాత ప్రతి ఒక్కరూ 3 మొక్కలు నాటాలని సూచించిన ప్రధాని, అందులో ఒకటి తమ మాతృమూర్తి పేరిట నాటాలని కోరారు. బహిరంగ, మతపరమైన ప్రాంతాల్లో పరిశుభ్రత, స్థానిక ఉత్పత్తుల కొనుగోలు, స్థానిక పర్యాటకాన్ని ప్రోత్సహించడం, చిరుధాన్యాలు తినడం, నూనె వాడకాన్ని తగ్గించడం ద్వారా ఆరోగ్యకరమైన భోజనం చేయడం వంటి ప్రతిజ్ఞలు చేయాలని సూచించారు. యోగా, శారీరక దారుఢ్యం, ప్రకృతికి సేవ చేయడం వంటి అంశాలను కూడా ప్రస్తావించారు.

"శ్రీ కాల భైరవ ఆలయాన్ని సందర్శించి పూజలు చేయడం, శ్రీ గురు భైరవైక్య ఆలయాన్ని ప్రారంభించడం నా మనసులో ఎప్పటికీ నిలిచిపోతాయి. మీ అందరి మధ్యకు వచ్చే అవకాశం లభించడం నా అదృష్టంగా భావిస్తున్నాను. నా హృదయం ప్రస్తుతం ఎన్నో భావోద్వేగాలతో నిండిపోయింది. వాటిని మాటల్లో వర్ణించడం కష్టం. భారతదేశం వేల సంవత్సరాలుగా వర్ధిల్లుతున్న ఒక సజీవ నాగరికత. ప్రపంచంలోని అతి తక్కువ దేశాలకు మాత్రమే ఇంత సుదీర్ఘ కాలం పాటు నిలిచి ఉండే సంప్రదాయాలు ఉన్నాయి. ఆదిచుంచనగిరి మహాసంస్థాన మఠం సంప్రదాయ నిరంతరతకు ప్రతీక. దాదాపు 2,000 సంవత్సరాల చరిత్ర ఈ మఠానికి ఉంది. మన సమాజంలో కేవలం ఆధ్యాత్మిక మార్గదర్శకత్వానికే పరిమితం కాని మహనీయులు పుడుతూనే ఉన్నారు. వారు ప్రజల మధ్యే జీవించారు. వారు ప్రజల సుఖదుఃఖాలను అర్థం చేసుకున్నారు. ప్రజల కష్టాలను స్వయంగా అనుభవించి, సమాజాన్ని దుఃఖం, బాధలు ఇబ్బందుల నుంచి బయటపడేసే మార్గాన్ని చూపించారు. దివంగత బాలగంగాధరనాథ మహాస్వామి విద్య, వైద్య రంగాల్లో మార్పు కోసం ఎంతో కృషి చేశారు. కర్ణాటక ఫిలాసఫీ, టెక్నాలజీ రెండింటిలోనూ మెరుగ్గా ఉంటుందని నేను ఎప్పుడూ చెబుతూనే ఉంటాను."

**కోట్ల మంది ప్రజలకు ఉచితంగా వైద్య సౌకర్యం**

అంతకుముందు కర్ణాటక మాండ్య జిల్లాలో పర్యటించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆదిచుంచనగిరి మఠానికి వెళ్లి అక్కడ గురు భైరవైక్య మందిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదిచుంచనగిరి మఠం 71వ పీఠాధిపతి బాలగంగాధరనాథ మహాస్వామి స్మృత్యర్థం ఈ ఆలయం నిర్మించారు. తర్వాత అక్కడ జరిగిన సభలో పాల్గొన్న ప్రధాని మోదీ, సౌందర్య లహరి– శివ మహిమ స్తోత్రం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రధాని ఎణ దేవెగౌడ, కేంద్ర మంత్రి కుమారస్వామి, శోభా కరంద్లాజే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా కొన్ని కోట్ల మంది ప్రజలకు ఉచితంగా వైద్య సౌకర్యం అందిస్తున్నామని ప్రధాన మోదీ వెల్లడించారు. ప్రస్తుతం ఈ పథకం కింద 70 ఏళ్లు దాటిన వృద్ధులకు కూడా అవకాశం కల్పించామని వివరించారు.

## బలవంతపు భూసేకరణ ఆపకపోతే ఉద్యమం ఉద్ధృతం: వికారాబాద్‌లో కల్వకుంట్ల కవిత గర్జన

పారిశ్రామికీకరణ పేరుతో పరిగి ప్రాంత రైతుల నుంచి బలవంతంగా సాగు భూములను లాక్కుంటున్నారంటూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రత్యక్ష పోరాటానికి దిగారు. వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం వద్ద వందలాది మంది రైతులతో కలిసి ఆమె భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, భూసేకరణ నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తాతల కాలం నాటి సారవంతమైన భూములను నమ్ముకుని బతుకుతున్న అన్నదాతల పొట్ట కొట్టడం అన్యాయమని కవిత ఈ సందర్భంగా మండిపడ్డారు. రైతుల సమ్మతి లేకుండా ఏ ఒక్క ఎకరా భూమిని తీసుకోవడానికి వీల్లేదని, ప్రభుత్వం తన మొండివైఖరిని వీడకపోతే ఈ పోరాటాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. పారిశ్రామికీకరణ ముసుగులో భూసేకరణకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. కవిత పిలుపుతో ఈ ఆందోళనలో స్థానిక నాయకులు, తెలంగాణ జాగృతి కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో వికారాబాద్ పరిసరాల్లో ఉద్రిక్తత నెలకొంది. పరిస్థితిని గమనించిన పోలీసులు అక్కడ భారీగా మోహరించారు. కవిత రాకతో ఈ భూపోరాటం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.

## బిహార్ సీఎంగా సమ్రాట్ చౌధరీ ప్రమాణస్వీకారం- తొలి బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు

బిహార్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్రానికి చెందిన సీనియర్ బీజేపీ నేత సమ్రాట్ చౌధరీ నూతన ముఖ్యమంత్రిగా బుధవారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. పట్నాలోని లోక్ భవన్‌లో జరిగిన ఘన కార్యక్రమంలో గవర్నర్ సయ్యద్ అతా హస్‌నైన్ ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఆ కార్యక్రమానికి మాజీ ముఖ్యమంత్రి, జేడీయూ అధినేత నీతీశ్ కుమార్‌తోపాటు పలు బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, జాతీయ నాయకులు హాజరయ్యారు. రాజ్యసభకు ఎన్నికవ్వడంతో నీతీశ్ కుమార్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయడం ద్వారా ఆ మార్పులకు నాంది పలికింది. దీంతో బిహార్‌లో తొలిసారిగా బీజేపీ సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేయడం చారిత్రాత్మక ఘట్టంగా మారింది. ఈ నేపథ్యంలో సమ్రాట్ చౌధరీ సీఎం పదవిని చేపట్టడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. అయితే సమ్రాట్ చౌధరీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ముందు పట్నాలోని పంచముఖి హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత లోక్ భవన్‌కు చేరుకుని అధికారిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయనతో పాటు ఉపముఖ్య మంత్రులుగా జేడీయూ సీనియర్ నేతలు విజయ్ కె చౌధరీ, బిజేంద్ర ప్రసాద్ యాదవ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కూటమి సమీకరణం బిహార్ రాజకీయాల్లో కొత్త సమతుల్యతను సూచిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. 1968 నవంబరులో జన్మించిన సమ్రాట్ చౌధరీ రాజకీయ నేపథ్యం గల కుటుంబానికి చెందినవారు. ఆయన తండ్రి శకుని చౌధరీ తారాపుర్ నియోజకవర్గం నుంచి ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రత్యేక గుర్తింపు పొందారు. అదే నియోజకవర్గం నుంచి సమ్రాట్ చౌధరీ 2025 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా విజయం సాధించి తన ప్రభావాన్ని చాటుకున్నారు. సమ్రాట్ చౌధరీ రాజకీయ ప్రస్థానం 1990లలో ప్రారంభమైంది. మొదట ఆర్జేడీలో చేరి రాజకీయాల్లో అడుగుపెట్టారు. అనంతరం జేడీయూలో చేరి కీలక పాత్ర పోషించారు. 2017 చివర్లో బీజేపీలో చేరిన ఆయన పార్టీ అభివృద్ధికి కృషి చేసి కీలక నాయకుడిగా ఎదిగారు.

## 'మన తలలపై వేలాడుతున్న కత్తి మనపైనే పడింది'- డీలిమిటేషన్‌పై స్టాలిన్ ఫైర్

ప్రత్యేక పార్లమెంటు సెషన్‌లో నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లుకు సవరణ చేసేందుకు కేంద్రం యోచిస్తుండటంపై తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ భగ్గుమన్నారు. ఈ సవరణ బిల్లును ప్రతిపాదించడం అనేది తమిళనాడు సహా అన్ని దక్షిణాది రాష్ట్రాలకు భారీ చారిత్రక అన్యాయం చేయడమేనని ఆయన మండిపడ్డారు. 'మన తలలపై వేలాడుతున్న కత్తి మనపైనే పడింది' అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇందుకు నిరసనగా గురువారం రోజు (ఏప్రిల్ 16న) తమిళనాడువ్యాప్తంగా నల్లజెండాలతో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని స్టాలిన్ పిలుపునిచ్చారు. ఇళ్లు, బహిరంగ ప్రదేశాలపై నల్లజెండాలను ఎగురవేయాలన్నారు. ఆత్మగౌరవాన్ని కోరుకునే ప్రతీ తమిళుడు నల్లజెండాలతో కేంద్ర ప్రభుత్వానికి నిరసన తెలపాలని ఆయన కోరారు.

**పార్టీలు, ఎంపీలు ఏకం కావాలి**

తీవ్ర ఆందోళన రేకెత్తిస్తున్న ఈ పెను ముప్పును సమన్వయంతో ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన వ్యూహంపై డీఎంకే ఎంపీలతో పాటు అన్ని రాష్ట్రాల్లోని ఎంపీలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు సీఎం స్టాలిన్ వెల్లడించారు. ఇది పార్టీలు, వ్యక్తులకు సంబంధించిన అంశం కాదని, తమ ప్రజల హక్కుల పరిరక్షణతో ముడిపడిన అంశమన్నారు. దేశ ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు అన్ని పార్టీలు, ఎంపీలు ఏకం కావాలని పిలుపునిస్తూ ఆయన ఒక ట్వీట్ చేశారు. బుధవారం ఉదయం ఎన్నికల ప్రచారం కోసం తమిళనాడులోని ధర్మపురికి స్టాలిన్ వెళ్లారు. అక్కడి నుంచే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డీఎంకే ఎంపీలతో ఆయన అత్యవసరంగా సమావేశమయ్యారు. లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన వల్ల తమిళనాడు ఎదుర్కొనే పరిణామాలపై వారితో స్టాలిన్ చర్చించారు. ఆ వెంటనే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల డీఎంకే ముఖ్యనేతలతోనూ ఆయన సంభాషించారు. నిరసన కార్యక్రమాల నిర్వహణపై వారికి దిశానిర్దేశం చేశారు.

**దక్షిణాది రాష్ట్రాలను శిక్షిస్తున్నారా ?**

'భారతదేశ వృద్ధికి దోహదపడుతున్నామనే నేరానికి తమిళనాడు, దక్షిణాది రాష్ట్రాలను శిక్షిస్తున్నారా ? తమిళనాడు, దక్షిణ రాష్ట్రాలకు ఈ రూపంలో తిరిగి చెల్లిస్తున్నారా? లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన చట్టానికి సవరణ దిశగా కేంద్రం అడుగులు వేస్తే, యావత్ దక్షిణాదిలో భారీ ఆగ్రహ జ్వాలలు ఎగిసిపడతాయి. దీనిపై వింధ్య పర్వతాలకు దక్షిణాన ఉన్న ప్రతీ దక్షిణ భారతీయుడు ఆగ్రహంతో రగిలిపోతున్నాడు. డీలిమిటేషన్ సవరణ బిల్లు విషయంలో బీజేపీ ముందుకే సాగితే తీవ్ర పర్యవసానాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రజాగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుంది. బీజేపీ నిప్పుతో చెలగాటం ఆడుతోంది. ప్రతిపాదిత డీలిమిటేషన్ సవరణ బిల్లును కేంద్రం ఉపసంహరించుకోకుంటే తీవ్ర పర్యవసానాలను ఎదుర్కొంటుంది. తమిళనాడు ప్రజల వాణిని వినిపించుకోకుంటే, బీజేపీ భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తుంది. నేను డీఎంకే అధ్యక్షుడి హోదాలో ఈ మాటలు చెప్పడం లేదు. ఆత్మగౌరవం కలిగిన తమిళుడిగా నా మనసులోని మాటలను వినిపిస్తున్నాను' అని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ చెప్పారు.

**మహిళా కోటా ముసుగులో డీలిమిటేషన్ బిల్లు : మారన్**

'మళ్లీ లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన జరిగితే ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే దక్షిణాది రాష్ట్రాల్లో సీట్లు బాగా తగ్గిపోతాయి. రాష్ట్రాల జనాభా ప్రాతిపదికన సీట్లను పెంచకూడదు. రాష్ట్రాల్లోని ప్రస్తుత లోక్‌సభ, అసెంబ్లీ సీట్ల నిష్పత్తి ప్రాతిపదికనే డీలిమిటేషన్ జరగాలి. అన్ని రాష్ట్రాల హక్కులను కేంద్ర ప్రభుత్వం గౌరవించాలి. ఏప్రిల్ 16 నుంచి జరగనున్న పార్లమెంటు ప్రత్యేక సెషన్‌లో బలవంతంగా రాజ్యాంగ సవరణ బిల్లులను ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. మహిళా రిజర్వేషన్ బిల్లు ముసుగులో నియోజకవర్గాల పునర్విభజన సవరణ బిల్లు ఆమోదానికి కుట్ర జరుగుతోంది. ఇప్పుడు అత్యంత ప్రమాదకర అంశం నియోజకవర్గాల పునర్విభజనే. 2011 జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్‌ను పూర్తి చేయాలని మోదీ సర్కారు భావిస్తోంది. ఈ ప్రతిపాదనను అన్ని విపక్ష పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. ఎందుకంటే అలా చేయడం సరికాదు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని లోక్‌సభ సీట్లను 80 నుంచి 240కు పెంచాలని అనుకుంటున్నారు' అని డీఎంకే ఎంపీ దయానిధి మారన్ పేర్కొన్నారు.

## 24 ఏళ్లలో మోదీపై ఒక్క అవినీతి మచ్చ లేదు- టీఎంసీ దోచుకున్న ప్రతి పైసా తిరిగి వసూలు చేస్తాం: అమిత్ షా

ప్రధాని మోదీ గుజరాత్‌లో 12 ఏళ్లు పాలించారు. కేంద్రంలో మరో 12 ఏళ్లుగా నాయకత్వం వహిస్తున్నారు. అయినా సరే ఒక్క రూపాయి అవినీతి ఆరోపణ కూడా ఎదుర్కోలేదు. బంగాల్‌లో బీజేపీని అధికారంలోకి తీసుకురండి. టీఎంసీ నాయకులు ప్రజల నుంచి దొంగలించిన ప్రతి పైసాను, వడ్డీతో సహా మేం తిరిగి రాబడతాం" అని అమిత్ షా తెలిపారు.

**టీ తోట కార్మికులకు భూ హక్కులు :** బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత టీచర్ల నియామక స్కాంలో రూ.300 కోట్లు, ఉత్తర బంగాల్ వరద సహాయ నిధుల్లో రూ.100 కోట్లు దుర్వినియోగం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అమిత్ షా హెచ్చరించారు. ఉత్తర బంగాల్ మూడు 'టీ'లతో (టీ, టింబర్, టూరిజం) ప్రసిద్ధి చెందిందని, కానీ సీఎం మమతా నాలుగో టీగా బీజేపీ కార్యకర్తల కన్నీళ్లను జోడించారని విమర్శించారు. ఉత్తర బంగాల్ అభివృద్ధికి ప్రత్యేక పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. టీ తోట కార్మికులకు భూ హక్కులు కల్పించి వారిని భూస్వాములుగా మారుస్తామని వెల్లడించారు. టీఎంసీ గూండాలను గుర్తించి చట్టం ముందు నిలబెట్టడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం (ఈవీఎం)లో కమలం గుర్తుపై ఓటు వేసి బీజేపీని అధికారంలోకి తీసుకురావాలని ప్రజలను కోరారు.

**'లవ్, ల్యాండ్ జిహాద్‌కు ముగింపు పలుకుతాం' :** ప్రజలు బీజేపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని, అప్పుడు బంగాల్ అంతటా ఎవరూ నాలుగు వివాహాలు చేసుకోలేరని అమిత్ షా తెలిపారు. తాము లవ్, ల్యాండ్ జిహాద్‌కు ముగింపు పలుకుతామని అన్నారు. అలాగే మహిళలకు ప్రతి నెలా రూ. 3 వేలు, నిరుద్యోగ యువతకు రూ. 3000 ఇస్తామమని చెప్పారు. తల్లులు, సోదరీమణులు ప్రభుత్వ బస్సుల్లో టికెట్లు కొనాల్సిన అవసరం ఉండదు, వారు ఉచితంగా ప్రయాణించగలుగుతారుని అన్నారు.

**అధికారంలోకి వచ్చాక కేసుల ఉపసంహరణ : అమిత్ షా**

అధికారంలోకి వచ్చిన వెంటనే డార్జిలింగ్‌లోని గూర్ఖాలాండ్ సమస్య పరిష్కారానికి రాజ్యాంగబద్ధంగా శాశ్వత పరిష్కారం చూపుతామని అమిత్ షా తెలిపారు. గతంలో జరిగిన హింసాత్మక ఆందోళనల నేపథ్యంలో గుర్ఖా సోదరులపై వేల సంఖ్యలో తప్పుడు కేసులు నమోదు చేశారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని ఉపసంహరిస్తామని స్పష్టం చేశారు. గుర్ఖా సమస్య పరిష్కారం కోసం గతంలో దిల్లీలో నిర్వహించిన మూడు సమావేశాలకు మమతా హాజరు కాలేదని ఆరోపించారు. మధ్యవర్తిని నియమించినప్పటికీ ఆమె సహకరించలేదని విమర్శించారు. రాష్ట్రంలో చొరబాట్లు, గూండా రాజ్యం, మాఫియా వ్యవస్థకు ముగింపు పలుకుతామని పేర్కొన్నారు.

బంగాల్‌లో మొత్తం 294 అసెంబ్లీ స్థానాలకు రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. మొదటి దశ ఏప్రిల్ 23 కాగా, రెండో దశ 29న పోలింగ్ జరగనుంది. మే 24న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. 2021 బంగాల్ ఎన్నికల్లో టీఎంసీ 213 అసెంబ్లీ సీట్లు రాగా, బీజేపీకి 77 స్థానాల్లో గెలుపొందింది. ఈసారి ఎలాగైనా అధికార పీఠాన్ని కైవసం చేసుకోవాలని చూస్తోంది. అటు టీఎంసీ కూడా అదే ప్రయత్నంలో ఉంది.

## తెలంగాణలో భగ్గుమన్న సూరీడు..

ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ కీలక హెచ్చరిక జారీ చేసింది. రానున్న ఐదు రోజుల పాటు ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని, ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల మార్కును కూడా దాటవచ్చని అధికారులు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.రాష్ట్ర వ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలకు పైగా నమోదవుతన్నాయి. రానున్న మూడు రోజులు గరిష్ట ఉష్ణోగ్రతలు క్రమేపి ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఒకవైపు ఎండల తీవ్రత మరో వైపు ఉక్కపోతతో జనం అల్లాడిపోతున్నారు. ఉదయం 10 గంటలు దాటిందంటే ప్రజల ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు బయపడతున్నారు. నిన్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 43.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

**జాగ్రత్తలు తీసుకోవాలని అధికారుల సూచనలు :** రానున్న మూడు రోజులు గరిష్ట ఉష్ణోగ్రతలు క్రమేపి ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఇవాళ, రేపు, ఎల్లుండి పలు జిల్లాల్లో వడ గాల్పులు వీచే అవకాశం ఉందని, ప్రజలు పలు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. మధ్యాహ్నం సమయంలో ప్రజలు అవసరమైతేనే బయటకు రావాలని అధికారులు సూచిస్తున్నారు. డీహైడ్రేషన్ బారిన పడకుండా చల్లని నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు లాంటివి మధ్యమధ్యలో తీసుకోవాలన్నారు. ఎండ నేరుగా తగలకుండా టోపీ లేదా గొడుగు ఉపయోగించడం మంచిదని సూచించారు.

**పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ :** ఇవాళ ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్ నగర్, నిజామాబాద్‌తో పాటు ఖమ్మం, మెదక్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, హైదరాబాద్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. రేపు ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్ నగర్‌తో పాటు నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మేడ్చల్ మల్కాజ్‌గిరి, హైదరాబాద్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. ఎల్లుండి ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్ నగర్‌తో పాటు నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మేడ్చల్ మల్కాజ్ గిరి, హైదరాబాద్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసిన జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల మేర నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు.

**ఆ జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం :** ఇవాళ ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు నిజామాబాద్, ఖమ్మం, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. రేపు ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని, ఈ జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.

## నియోజకవర్గాల పునర్విభజన బిల్లును వ్యతిరేకిస్తున్నాం- రాజకీయ లబ్ధి కోసం కేంద్రం ప్రయత్నం : ఖర్గే

డీలిమిటేషన్ బిల్లుకు సంబంధించి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. నియోజకవర్గాల పునర్విభజన బిల్లును వ్యతిరేకించాలని నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. అయితే మహిళా రిజర్వేషన్లకు తాము వ్యతిరేకం కాదని ఆయన స్పష్టం చేశారు. రాజకీయ లబ్ధి కోసం కేంద్రం ప్రయత్నిస్తోందని ఖర్గే ఆరోపించారు. "మహిళా రిజర్వేషన్ బిల్లుకు మేమంతా అనుకూలం. కానీ వారు దాన్ని తీసుకువచ్చిన విధానం పట్ల మాకు అభ్యంతరాలున్నాయి. ఇది పూర్తిగా రాజకీయ ప్రేరేపితం. కేవలం ప్రతిపక్ష పార్టీలను అణిచివేయడానికే ప్రభుత్వం ఇలా చేస్తోంది. మహిళా రిజర్వేషన్ బిల్లు మద్దతు ఇవ్వాలని మేమంతా నిర్ణయించాం. 2010 నుంచి 2023 వరకు రాజ్యాంగ సవరణకు అంగీకరించాం. పాత సవరణలనే అమలు చేయాలని కోరుతున్నాం. నియోజకవర్గాల పునర్విభజన(డీలిమిటేషన్) విషయంలో వారు(ప్రభుత్వం) కొన్ని గిమ్మిక్కులు చేస్తోంది. పార్టీలన్నీ ఏకతాటిపై నిలిచి పార్లమెంటులో ఐక్యంగా పోరాడాలి. మేం ఈ బిల్లును వ్యతిరేకిస్తాం, కానీ మహిళా రిజర్వేషన్లకు మేం వ్యతిరేకం కాదు. ఈ బిల్లులో వారు పొందుపరిచిన విధానం చూస్తే కనీసం జనాభా లెక్కల ప్రక్రియను కూడా పూర్తి చేయకుండానే డీలిమిటేషన్ అంశాన్ని చేర్చారు. రాజ్యాంగ అధికారాలన్నింటినీ కార్యనిర్వాహక వ్యవస్థ తన గుప్పిట్లోకి తీసుకుంటోంది. ప్రధానంగా వ్యవస్థలు, పార్లమెంటు చేతుల్లో ఉండాల్సిన అధికారాన్ని ఎప్పుడైనా డీలిమిటేషన్ మార్చుకునే వీలుగా వారు తమ చేతుల్లోకి తీసుకున్నారు. అసోం, జమ్మూకశ్మీర్‌లో వారు ఇప్పటికే మమ్మల్ని మోసం చేశారు."

## మహిళా రిజర్వేషన్ బిల్లుకు కేసీఆర్ పూర్తి మద్దతు.. డీలిమిటేషన్‌పై వార్నింగ్

మహిళా రిజర్వేషన్ బిల్లు, నియోజకవర్గాల పునర్విభజన అంశాలపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన గళాన్ని వినిపించారు. ఎర్రవెల్లిలోని ఫామ్ హౌస్ లో పార్టీ ముఖ్యనేతలు కేటీఆర్, హరీశ్ రావులతో నిర్వహించిన భేటీలో జాతీయ రాజకీయ పరిణామాలు, దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలపై ఆయన సుదీర్ఘంగా చర్చించా రు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ... చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ప్రకటించారు. గతంలోనే తాము అసెంబ్లీలో దీనికి అనుకూలంగా తీర్మానం చేశామని గుర్తు చేస్తూ, రాజ్యసభలో తమ ఎంపీలు ఈ బిల్లుకు మద్దతు తెలుపుతారని స్పష్టం చేశారు. ఇదే సమయంలో... నియోజకవ ర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు జరిగే అన్యాయంపై కేసీఆర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాలకు 24 శాతం ఎంపీ సీట్లు ఉన్నాయని... జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాల సీట్ల శాతం (ప్రస్తుతం ఉన్న 24 శాతం) తగ్గకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఒకవేళ దక్షిణాది ప్రయోజనాలకు విఘాతం కలిగితే రాజీలేని పోరాటం చేస్తామని కేంద్రానికి హెచ్చరికలు జారీ చేశారు. ఈ నెల 20న జగిత్యాలలో జరగనున్న భారీ బహిరంగ సభ, అలాగే ఏప్రిల్ 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని కేటీఆర్, హరీశ్ రావులను ఆదేశించారు.

## అదే జరిగితే కేసీఆర్ ముందుండి ఉద్యమాన్ని నడిపిస్తారు: బీజేపీకి కేటీఆర్ హెచ్చరిక

నియోజకవర్గాల పునర్విభజన బిల్లులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగితే కేసీఆర్ ముందుండి ఉద్యమాన్ని నడిపిస్తారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. డీలిమిటేషన్ బిల్లు పేరుతో మనకు అన్యాయం జరిగితే కేసీఆర్ నాయకత్వంలో ఉద్యమం మొదలవుతుందని హెచ్చరించారు. పార్లమెంటులో ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల వాటా 24 శాతంగా ఉందని, డీలిమిటేషన్ తర్వాత ఇది అలాగే ఉండాలని అన్నారు. బీజేపీ పార్టీ తెలంగాణకు ఎప్పుడూ మంచి చేయదని విమర్శించారు. అసెంబ్లీ నియోజకవర్గాలు, పార్లమెంటు సీట్లను 50 శాతం పెంచుతామని కిషన్ రెడ్డి చెబుతున్నారని, కానీ డీలిమిటేషన్ బిల్లులో ఆ అంశమే లేదని అన్నారు. కిషన్ రెడ్డి చెప్పిన ప్రకారం అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 179కి, 17 లోక్ సభ స్థానాలకు 26 పెరుగుతాయని చెప్పారని తెలిపారు. కానీ బిల్లులో ఈ పెరుగుదల లేదని అన్నారు. బీజేపీ ఎప్పుడూ తెలంగాణకు మిత్రుడు కాదని విమర్శించారు. 2014 ఏపీ పునర్విభజన బిల్లులోనే సీట్ల పెంపు హామీ ఉందని గుర్తు చేశారు. కానీ ఇప్పటి వరకు ఆ హామీని నెరవేర్చలేదని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు బీఆర్ఎస్ అనుకూలమేనని, కానీ డీలిమిటేషన్ బిల్లులో మాత్రం తెలంగాణకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజనను అమలును వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.

## రేవంత్ రెడ్డిపై కాంగ్రెస్ పార్టీ పట్టు కోల్పోయింది: జీవన్ రెడ్డి

- ఎమ్మెల్యేలకు రేవంత్ రెడ్డి కనీసం అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని విమర్శ
- కాంగ్రెస్ పార్టీని రేవంత్ రెడ్డి ఖతం చేస్తున్నాడని ఆగ్రహం
- రేవంత్ రెడ్డి లాంటి వ్యక్తి కేసీఆర్ కాదన్న జీవన్ రెడ్డి
- కేసీఆర్‌కు ప్రజలు అంటే గౌరవం ఉందని వ్యాఖ్య

రేవంత్ రెడ్డిపై కాంగ్రెస్ పార్టీ పట్టు కోల్పోయిందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా మారిందని ఎద్దేవా చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఎమ్మెల్యేలకు రేవంత్ రెడ్డి కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడంలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీని రేవంత్ రెడ్డి ఖతం చేస్తున్నాడని అన్నారు. కేసీఆర్ తన వయసును గౌరవించి 'అన్న' అని పిలుస్తారని తెలిపారు. కేసీఆర్‌కు ప్రజలంటే గౌరవం ఉందని, ఆయన రేవంత్ రెడ్డి లాంటి వ్యక్తి కాదని వ్యాఖ్యానించారు. తాను బీఆర్ఎస్ పార్టీలో చేరడంపై స్పందిస్తూ, ఆఖరి వరకు ప్రజల కోసమే పోరాడతానని స్పష్టం చేశారు. సాధారణంగా పార్టీ సూచనలను బట్టి ప్రభుత్వం నడుస్తుందని, కానీ రేవంత్ రెడ్డి పాలనలో ప్రభుత్వం సూచన మేరకు పార్టీ నడుస్తుందని విమర్శించారు.

# వడదెబ్బ బాధితులకు సత్వరమే చికిత్స

**ప్రతి హాస్పిటల్‌లో ప్రత్యేకంగా ఒక బృందం**

**ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ**

**వేసవి నేపథ్యంలో హాస్పిటళ్లలో ప్రత్యేక ఏర్పాట్లు**

**అవసరమైన చోట ఫ్యాన్లు, కూలర్లు, ఏసీల ఏర్పాటు**

**అన్ని వార్డులు, వెయిటింగ్ ఏరియాలో మంచినీటి సౌకర్యం**

**అగ్ని ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు**





రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరుగుతున్నందున అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచించారు. ప్రభుత్వ దవాఖాన్లలో తాగు నీటి సౌకర్యం, అవసరమైన చోట ఫ్యాన్లు, కూలర్ల ఏర్పాటు, అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు, వడ దెబ్బ బాధితులకు చికిత్స అందించేందుకు హాస్పిటళ్లలో ప్రత్యేక ఏర్పాట్లు, ఇతర అంశాలపై ఉన్నతాధికారులతో మంత్రి బుధవారం సమీక్ష చేశారు. హైదరాబాద్ జూబ్లిహిల్స్‌లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ, డాక్టర్ గౌరవ్ ఉప్పల్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్, డాక్టర్ సంగీత సత్యనారాయణ, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, డాక్టర్ నరేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఎండా కాలం నేపథ్యంలో వడ దెబ్బ బాధితులకు చికిత్స అందించేందుకు తీసుకుంటున్న చర్యలను, హాస్పిటళ్లలో అవుట్ పేషెంట్, ఇన్‌పేషెంట్ల కోసం చేసిన ఏర్పాట్లను అధికారులు మంత్రికి వివరించారు. వడ దెబ్బ బాధితులకు తక్షణమే చికిత్స అందించేందుకు అన్ని హాస్పిటల్స్‌లో ఇప్పటికే ఏర్పాట్లు చేశామని, అవసరమైన మెడిసిన్, ఓఆర్ఎస్ వంటివి అందుబాటులో ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ హాస్పిటల్స్‌లో అవుట్ పేషెంట్లు, ఇన్ పేషెంట్లు, వారి అటెండెంట్లకు, హాస్పిటల్ సిబ్బందికి తాగు నీరు అందుబాటులో ఉంచాలని ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. పెద్ద హాస్పిటల్స్‌లో ప్రతి బ్లాక్‌లో, ప్రతి ఫ్లోర్‌లో డ్రింకింగ్ వాటర్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. హాస్పిటల్ ఆవరణలో అవసరమైన చోట చలివేంద్రాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నందున ఉక్కపోత సమస్య ఎక్కువ అవుతున్నదని, ఈ నేపథ్యంలో అవుట్ పేషెంట్లకు, ఇన్‌పేషెంట్లకు, హాస్పిటల్ సిబ్బందికి, డాక్టర్లకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలన్నారు. అవసరమైన చోట ఫ్యాన్లు, కూలర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఐసీయూలు, అవసరమైన ఇతర వార్డుల్లో ఏసీలు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఫ్యాన్లు, ఏసీలు, కూలర్లు రిపేర్ ఉంటే వెంటనే చేయించాలని ఆదేశించారు. అవసరమైతే దాతల సహకారం తీసుకోవాలన్నారు.

**అవగాహనతోనే నివారణ సాధ్యం**

వడ దెబ్బ నివారణ కోసం తీసుకుంటున్న చర్యలపై మంత్రి ఆరా తీశారు. వడ దెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. హాస్పిటల్స్, బస్ స్టాండ్లు, ఇతర రద్దీ ప్రాంతాలను ఎంపిక చేసుకుని అవేర్‌నెస్ ప్రోగ్రామ్స్ నిర్వహించాలన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించేందుకు అవసరమైన కంటెంట్‌ను రూపొందించి, ప్రజలకు చేరవేయాలన్నారు. ప్రతి సంవత్సరం ఉపాధి హామి కూలీలు, వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కార్మికులు వడ దెబ్బ బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని, వారిని దృష్టిలో పెట్టుకుని అవగాహన కార్యక్రమాలు రూపొందించుకోవాలన్నారు. పట్టణాల్లో ఆటోడ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లు, డెలివరీ బాయ్స్, ఇతర గిగ్ వర్కర్లకు వడ దెబ్బపై అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు.

**ఎమర్జెన్సీలో డెడికేటెడ్ టీమ్ ఉండాలి:**

వడ దెబ్బతో అనారోగ్యం పాలైన వారికి చికిత్స అందించేందుకు ఒక బృందాన్ని హాస్పిటల్ ఎమర్జెన్సీ ఏరియాలో సిద్ధంగా ఉంచాలని మంత్రి సూచించారు. పేషెంట్ వచ్చిన వెంటనే చికిత్స ప్రారంభించేలా ఈ బృందంలోని సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. అవసరమైన మెడిసిన్ కూడా సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.

**జనరేటర్లు సిద్ధంగా ఉండాలి**

వేసవి కాలంలో గాలిదుమారాలు, ఈదురు గాలులు, అకాల వర్షాల వలన విద్యుత్ సరఫరాలో ఆటంకం ఏర్పడే ప్రమాదం ఉంటుందని, ఇలాంటి సమయాల్లో పేషెంట్లకు ఇబ్బంది కలగకుండా వెంటనే జనరేటర్లు ఆన్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. దాదాపు అన్ని హాస్పిటల్స్‌లో జనరేటర్లు ఉన్నాయని అధికారులు మంత్రికి తెలిపారు. అయితే, వెంటనే వాటి పనితీరును పరిశీలించాలని, అవసరమైన చోట రిపేర్లు, మెయింటనన్స్ చేయించాలని మంత్రి ఆదేశించారు.

**అగ్ని ప్రమాదాల ముప్పు**

వేసవిలో అగ్ని ప్రమాదాలు జరిగే ముప్పు ఎక్కువగా ఉంటుందని అధికారులను మంత్రి అప్రమత్తం చేశారు. అన్ని హాస్పిటల్స్‌లో అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. షార్ట్ సర్క్యూట్ వల్లే అగ్ని ప్రమాదాలకు ఆస్కారం ఉంటుందని, ఈ నేపథ్యంలో అన్ని హాస్పిటల్స్‌లో పవర్ కేబుల్స్‌ను వెంటనే చెక్ చేయించాలని మంత్రి ఆదేశించారు. అవసరమైన చోట పాత వైర్ల స్థానంలో, కొత్త వైరింగ్ చేయించాలని సూచించారు. హాస్పిటళ్ల లోపల, బయట గుట్కా నమలడం, స్మోకింగ్, డ్రింకింగ్ వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించొద్దని మంత్రి ఆదేశించారు. అన్ని హాస్పిటల్స్‌లో ఫైర్ అలార్మ్, స్మోక్ డిటెక్టర్స్ మాక్ డ్రిల్ నిర్వహించాలని సూచించారు. అవసరమైన చోట కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. మంటలను ఆర్పే యంత్రాలు సరిపడా ఉన్నాయో, లేవో? చూడాలని.. వాటి ఎక్స్‌పైరీ గడువు తేదీలను సైతం చెక్ చేయాలని ఆదేశించారు. మంటలు ఆర్పే యంత్రాల వినియోగంపై హాస్పిటల్ సిబ్బంది, సెక్యూరిటీకి మరోసారి శిక్షణ ఇవ్వాలని ఉన్నతాధికారులకు మంత్రి సూచించారు. ఫైర్ సేఫ్టీ, షార్ట్ సర్క్యూట్‌కు సంబంధించి చేయాల్సిన, చేయకూడని పనుల గురించి సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమీపంలోని ఫైర్ స్టేషన్ అధికారులతో, హాస్పిటల్ అధికారులు సమన్వయం చేసుకోవాలని, ఫైర్ సేఫ్టీ మాక్‌డ్రిల్స్ నిర్వహించాలని అధికారులకు సూచించారు.

**బాధితులకు అండగా ఉండండి.. ప్రజలకు మంత్రి విజ్ఞప్తి:**

ఎండలు ముదురుతున్నందున అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు మంత్రి పిలుపునిచ్చారు. పిల్లలు, వృద్ధులు, గర్భిణుల విషయంలో కుటుంబ సభ్యులు మరింత అప్రమత్తంగా ఉండాలని, వారిని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. బయటకు వెళ్లినప్పుడు ఎండదెబ్బ బారిన పడకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాగు నీరు తప్పనిసరిగా వెంట తీసుకెళ్లాలని, ఎక్కువసేపు ఎండలో ఉండకూడదని సూచించారు. ఒకవేళ ఏదైనా ఇబ్బంది కలిగితే తక్షణమే సమీపంలోని ప్రభుత్వ దవాఖానకు వెళ్లాలన్నారు. తమ చుట్టూ ఉన్నవారిలో ఎవరికైనా వడ దెబ్బ తగిలితే, వెంటనే సమీపంలోని హాస్పిటల్‌కు బాధితున్ని తరలించాలని, 108 అంబులెన్స్‌కు సమాచారం చేరవేయాలని మంత్రి ప్రజలను కోరారు.

# జనగామ డిపో ఆధ్వర్యంలో

# "రోడ్డు సేఫ్టీ" పై విద్యార్థులకి వ్యాసరచన పోటీ.






జనగామ జిల్లారాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా జనగామ డిపో ఆర్టీసీ వారి ఆధ్వర్యంలో ఖిలాషాపూర్ జిల్లా పరిషత్ హై స్కూల్ లో "రోడ్డు సేఫ్టీ" పై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో పాల్గొన్న విద్యార్థుల నుండి ముగ్గురు విద్యార్థులను గుర్తించి వారికి డిపో మేనేజర్ స్వాతి బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి వీ.. రేహన్ పాషా, ద్వితీయ బహుమతి దీ. విజ్ఞశ్రీ, తృతీయ బహుమతి ఎ. ప్రణయ్. ఈ సందర్భంగా డిపో మేనేజర్ ఎస్.స్వాతి మాట్లాడుతూ రోడ్డు సేఫ్టీ అందరి బాధ్యత అని మీయొక్క తల్లిదండ్రులు బైకులపై వెళ్తున్నప్పుడు హెల్మెట్ ధరించడం మరచిపోతే మీరు గుర్తు చేయాలని, కార్లలో వెళ్తుంటే సీట్ బెల్ట్ ధరించాలని వాహనాలకి సంబంధించిన అన్ని ధ్రువ పత్రాలు వెంట ఉంచుకోవాలని అలాగే క్షేమంగా వెళ్లి ప్రాణాలతో తిరిగి రావాలని మరియు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని మీరు పాఠశాలకు వచ్చేటప్పుడు/వెళ్ళేటప్పుడు రోడ్డు దాటే క్రమంలో ఇరువైపులా చూసుకొని దాటాలని ముఖ్యంగా క్రమశిక్షణ ఎంతో అవసరమని విద్యార్థులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ హెడ్మాస్టర్ శ్రీ రవీందర్ ఉపాధ్యాయులు, ఆర్టీసీ సూపర్వైసర్లు వై.యాదమణి రావు, కుర్ర సురేందర్ గౌడ్, చామంతి, విద్యార్థులు పాల్గొన్నారు.

## చిన్న అంజయ్యకు ఇందిరమ్మ ఇల్లు - సర్పంచ్ ఆధ్వర్యంలో కార్యక్రమం



**తెహెల్కా రంగారెడ్డి జిల్లా ఏప్రిల్ 15 ప్రతినిధి ఈ.పద్మారావు కాపు:** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం కల్వకోల్ గ్రామంలో అర్హత గల లబ్ధిదారుడు అరడి చిన్న అంజయ్యకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో గ్రామంలో ఆనంద వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇల్లు వద్ద సంప్రదాయబద్ధంగా ముగ్గు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జనార్దన్ గౌడ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు,వార్డ్ సభ్యులు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.ముఖ్యంగా సాయిని గోపాల్ రెడ్డి, అరటి కుమార్,తిరుమల యాదయ్య,జంపుల భారతమ్మ,పులిమామిడి లక్ష్మీనారాయణ గౌడ్, బక్కని రవి మాదిగ,అరటి వెంకటేష్, గుర్రంపల్లి నరసింహ, రామచంద్రి, లబ్ధిదారుడు చిన్న అంజయ్య,లక్ష్మమ్మ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.గ్రామ అభివృద్ధికి ఇటువంటి పథకాలు ఎంతో ఉపయోగకరమని,అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు చేరాలని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## తెలంగాణ బీసీ వికాస సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ముక్తి పేట్ రవీందర్ గౌడ్



**కూకట్ పల్లి తెహెల్కా న్యూస్ ప్రతినిధి తెల్ల హరికృష్ణ ఏప్రిల్ 15** తెలంగాణ బీసీ వికాస సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ముక్తి పేట్ రవీందర్ గౌడ్ నియామక జరిగింది జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య పార్లమెంట్ సభ్యులు వారి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకుంటున్న ముక్తి పేట్ రవీందర్ గౌడ్ చేసిన ఈ యొక్క కార్యక్రమంలో బిసి వికాస సమితి అధ్యక్షులు భాశెట్టి నర్సింగరావు ప్రధాన కార్యదర్శి నారాయణ చారి గ్రేటర హైదరాబాద్ వైస్ ప్రెసిడెంట్ చిలక ప్రకాష్ ముదిరాజ్ యాదిలాల్ స్వామి మక్కాల్ రాజు పండిత కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు నాపై నమ్మకంతో నాకు వైస్ ప్రెసిడెంట్ రాష్ట్ర శాఖ ఇచ్చినందుకు ఆర్ కృష్ణయ్య గారికి భాశెట్టి నర్సింగరావు అన్నకు మరియు రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను ముక్తి పేట్ రవీందర్ గౌడ్.

## భువనగిరి పెద్దచెరువు కట్టవాకర్స్ నూతన కార్యవర్గ ఎన్నిక.







**యాదాద్రి భువనగిరి. తేహెల్క న్యూస్:**భువనగిరి ట్యాంక్ బండ్ వాకర్స్ అసోసియేషన్ ఏకగ్రీవంగా నూత న కమిటీని ఎన్నుకోవడం జరిగిం ది అధ్యక్షులు గుమ్ముల మల్లేశం, ఉపాధ్యక్షులు మంద నర్సింగరావు పాక నరేష్,జి పవన్ కళ్యాణ్,కొర టూరి రామచందర్,ప్రధాన కార్య దర్శిగా పాల నరేష్,కోఆర్డినేటర్, రత్నపురం వివేక్,సహాయ కార్యద ర్శి వడ్లకొండ మల్లేశం,కోశాధికారి బద్దంశ్రీనివాస్ రెడ్డి,కార్యవర్గసభ్యు లు కొంచ విజయ్,శ్రీధర్ గౌడ్,గౌర వాధ్యక్షులు పూస శ్రీనివాస్,ఓసా రి సతీష్ యాదవ్,గౌరవ సలహా దారు మరుగుమధు,ఎస్పై లక్ష్మణ్ 109 మంది సభ్యులచే ఏకగ్రీవం గా ఈ కమిటీని ఎన్నుకోవడం జరిగింది. గౌరవాధ్యక్షులు పూస శ్రీనివాస్ మాట్లాడుతూ... భువనగిరి పెద్ద చెరువు కట్ట పైన అన్ని వయసుల వారు వాకింగ్ చేసుకోవడానికి మరియు యోగా నిర్వహించడానికి అన్ని విధాల అ నువైన స్థలమని పిల్లలు,పెద్దలు, వయోజనులు,ఉద్యోగస్తులు అం దరూ కూడా తమ దైనందిన జీవి తంలో నడకను ఒక భాగంగా చే సుకుని తమయొక్క ఆరోగ్యాల ను కాపాడుకోవాలని తెలియజే శారు.అదేవిధంగా ఈరోజు వాక ర్స్ అందరికీ నర్సింగోజు సంతోష్ చారి దాతచే వాకర్స్ అందరికీ టీ షర్ట్స్ అందజేయడం జరిగింది.

## హనుమాన్ దేవాలయంలో

## "లక్ష తమలపాకుల"తో స్వామివారికి ప్రత్యేక పూజలు



**ఎల్బీనగర్,కర్మన్ ఘాట్, ఏప్రిల్ 15,తేహేల్కా ప్రతినిధి మురళీమోహన్ గౌడ్.**ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి శ్రీ కర్మన్ ఘాట్ హనుమాన్ దేవాలయం లో స్వామి వారికి విశేషంగా నిర్వహించిన "లక్ష తమలపాకుల" పూజ కార్యక్రమంలో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయ ఈఓ లావణ్య, చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, సుధీర్ రెడ్డి కి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ముద్ద రాజేశ్వరి,మాజీ ధర్మకర్తలు ముద్ద కళ్యాణ్, మధు సాగర్, యాది రెడ్డి, మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ స్ఫూర్తితో బాలల హక్కుల పరిరక్షణకు కృషి: బి. వచన్ కుమార్



హైదరాబాద్, ఏప్రిల్ 15, 2026: భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ గౌరవ సభ్యులు బి. వచన్ కుమార్ ఆ మహనీయునికి ఘన నివాళులర్పించారు. సామాజిక సంస్కర్తగా, భారత రాజ్యాంగ ముసాయిదా కమిటీ అధ్యక్షుడిగా, దేశ సామాజిక-ఆర్థిక నిర్మాణ శిల్పిగా అంబేద్కర్ చేసిన సేవలను ఈ సందర్భంగా ఆయన స్మరించుకున్నారు. హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ వద్ద ఉన్న డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి వచన్ కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న అంబేద్కర్ విగ్రహాలను సందర్శించి, వివిధ సంస్థల నాయకులతో కలిసి ఆయనకు వందనం చేశారు. ఈ సందర్భంగా బి. వచన్ కుమార్ మాట్లాడుతూ డాక్టర్ అంబేద్కర్ ఆశయాలైన సమానత్వం, న్యాయం స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ నిరంతరం కృషి చేస్తోంది. ముఖ్యంగా బాలల హక్కుల పరిరక్షణకు ఉద్దేశించిన చట్టాలైన ఆర్టీఈ (విద్యా హక్కు చట్టం), పోక్సో, బాల్య వివాహాల నిరోధక చట్టం (పీసీఎంఏ) వంటి వాటిని పటిష్టంగా అమలు చేయడం మా ప్రాధాన్యత అని అన్నారు. బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా నిర్మూలన, బాలకార్మిక వ్యవస్థ రూపుమాపడం, లింగ నిర్ధారణ పరీక్షల నిరోధం మరియు దత్తత చట్టాలను పర్యవేక్షించడం ద్వారా పిల్లల సర్వతోముఖాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. 'భారతదేశంలో సురక్షితమైన మరియు ఆరోగ్యవంతమైన బాల్యం' అనే నినాదంతో పిల్లల విద్య, ఆరోగ్యం, అభివృద్ధి మరియు సంక్షేమం కోసం కమిషన్ అంకితభావంతో తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ పనిచేస్తోంది. అని పేర్కొన్నారు.

# పులిమామిడిలో గ్రామస్థుల విజయం - దేవాలయ భూమి కౌలు స్థానికులకే



**తెహెల్కా రంగారెడ్డి జిల్లా ఏప్రిల్ 15 ప్రతినిధి ఈ.పద్మారావు కాపు:** పులిమామిడి గ్రామంలోని శ్రీ శ్రీ శ్రీ చీకటి వెంకటేశ్వర స్వామి దేవాలయానికి చెందిన 239 ఎకరాల భూమిలో 36.26 గుంటల భూమిని ఇతరులకు లీజ్‌కు ఇవ్వాలని చర్యలు జరుగుతున్నాయి. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్థులు ఆ భూమిని గ్రామస్తులకే కౌలు రూపంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామస్థుల అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న ఆలయ ట్రస్ట్ శాస్త్రి గార్లు మరియు ఎండోమెంట్ అధికారులు, ఆ భూమిని గ్రామస్థులే సాగు చేసుకునేలా ఇవ్వడానికి అంగీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మొకిరాల రాజశేఖర్ శర్మ, ఎండోమెంట్ అధికారి శ్రీనివాస్ రెడ్డి, గ్రామ పెద్దలు ఉప సర్పంచ్ పాపగల రాములు, అలువాల అశోక్, పాండురంగారెడ్డి, దామోదర్ గౌడ్, మహేందర్ రెడ్డి, పాపగల రవీందర్, మన్నె రాజు, గంగవరం చంద్రశేఖర్, తిమ్మగల శేఖర్, పాపగల సురేష్, పాపగల యాదయ్య, చింతకింది రమేష్, బండ నాగేష్, ఎంబడి వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పే షెంట్లకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలి. స్థానిక సంస్థల అద నపు కలెక్టర్





**యాదాద్రి భువనగిరి. తేహెల్క న్యూస్:** బుధవారం భువనగిరి మున్సిపా లి టీ పరిధిలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.
ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఆసుపత్రిలోని ప్రతి విభాగాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రిలో వైద్యులు మరియు సిబ్బంది ఎంతమంది విధులు ని ర్వహిస్తున్నారని సంబంధిత అధి కారులను అడిగి తెలుసుకుని రిజిస్టర్లను చెక్ చేశారు. డాక్టర్లు, సిబ్బంది అందరూ సమ యపాలన పాటించాలన్నారు. ఆసుపత్రికివచ్చే పేషెంట్లకు అందు బాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని అన్నారు. ప్రతిరోజు ఓ.పి కి ఎంతమంది వ స్తున్నారని ఓ.పి రిజిస్టర్ ను పరి శీలించారు. అదనపు కలెక్టర్ ఆసుపత్రి ఆవరణలో తిరుగుతూ పేషంట్ల వద్దకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులనుగురించి అడిగి తెలు సుకున్నారు, వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన చికిత్సలు అందిస్తున్నారా అని ఆ సుపత్రికి వచ్చిన పేషంట్లను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చి న రోగుల తో అదనపు కలెక్టర్ మాట్లాడారు డాక్టర్లు, సిబ్బంది మంచిగా చూస్తున్నారా అని ఆరా తీశారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఆసుపత్రి పరిసర ప్రాంతాలను ప్రతిరోజు శుభ్రపరచాలని సంబం ధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, సంబంధిత అధికారులు, తదితరు లు పాల్గొన్నారు.

# నిద్రమత్తులో సరూర్ నగర్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది.






**ఎల్బీనగర్, సరూర్ నగర్, ఏప్రిల్ 15, తేహల్కా ప్రతినిధి మురళీమోహన్ గౌడ్.** సరూర్ నగర్: ప్రజలకు సేవలు అందించాల్సిన ప్రభుత్వ కార్యాలయాలు నిర్లక్ష్యానికి కేంద్రాలుగా మారితే పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో సరూర్ నగర్ టౌన్ ప్లానింగ్ కార్యాలయం తీరు చూస్తుంటే స్పష్టంగా అర్థమవుతుంది. కార్యాలయ పనివేళల్లోనే సిబ్బంది టేబుల్లపై నిద్రపోతున్న ఘటనలు వెలుగులోకి రావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఉదయం ఆలస్యంగా కార్యాలయానికి రావడం, సాయంత్రం సమయం పూర్తికాకముందే వెళ్లిపోవడం వంటి అంశాలు ఇక్కడ సాధారణంగా మారిపోయాయని స్థానికులు చెబుతున్నారు. బయోమెట్రిక్ హాజరు వ్యవస్థ ఉన్నప్పటికీ, అది కేవలం పేరుకే పరిమితమైందని ఆరోపిస్తున్నారు. ఇక సరూర్ నగర్ పరిధిలో రోడ్ల ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు రోజురోజుకు పెరిగిపోతున్నా వాటిపై నియంత్రణ ఉండాల్సిన అధికారులు మౌనం వహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురవుతుండగా, రహదారులు ఇరుకుగా మారి పాదచారులు నడవటానికి కూడా ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ సమస్యలు పెరుగుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో తనిఖీలు జరపాల్సిన అధికారులు కార్యాలయాలకే పరిమితమవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్లక్ష్యం కారణంగా అక్రమ నిర్మాణదారులు మరింత ధైర్యంగా వ్యవహరిస్తున్నారని, కొంతమంది అధికారుల నుంచి అనధికార మద్దతు కూడా లభిస్తున్నదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కార్యాలయానికి వెళ్లి గంటల తరబడి ఎదురు చూసినా సరైన సమాధానం దొరకడం లేదని, ఫిర్యాదులు బుట్టదాఖలు అవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు తమ బాధ్యతలను విస్మరించడంతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఈ పరిస్థితుల్లో ప్రజలు ఇప్పుడు చట్టపరమైన మార్గాలను ఆశ్రయించే దిశగా ఆలోచిస్తున్నారు. అవసరమైతే హైకోర్టును ఆశ్రయించి తమ హక్కులను సాధించుకోవాలని భావిస్తున్నారు.
ఈ నేపథ్యంలో ప్రజలు పలువురు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. బయోమెట్రిక్ హాజరు వ్యవస్థ ఎందుకు అమలు కావడం లేదని, రోడ్ల ఆక్రమణలపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని, అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడంలో విఫలమవ్వడానికి కారణాలేమిటని ప్రశ్నిస్తున్నారు. అలాగే ఫిర్యాదులను ఎందుకు పట్టించుకోవడం లేదని, పనివేళల్లో నిద్రపోతున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమానికి దిగే అవకాశాలు ఉన్నాయని హెచ్చరిస్తున్నారు.







ఈరోజు వరంగల్ జిల్లా నెట్ బాల్ అసోసియేషన్ ఓ సిటీ స్టేడియంలో ఖాణా అనిల్ కుమార్ మాజీ షాప్ డైరెక్టర్ రాజనాల శ్రీహరి ఒలంపిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కైలాస్ యాదవ్ సమీక్షంలో జిల్లా కమిటీ ఏర్పాటు జరిగింది నూతన అధ్యక్షుడిగా తోట పూర్ణచందర్ రావు ఉపాధ్యక్షులు పోలె పాక ప్రసాద్. జిల్లా రమేష్ ప్రధాన కార్యదర్శిగా లిల్లీ ఫ్లారెన్స్ కోశాధికారిగా మౌనిక గౌడ్ జాయింట్ సెక్రటరీగా జు శ్రీనివాస్ కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. అనంతరం మాజీ షాప్ డైరెక్టర్ రాజనాల శ్రీహరి నూతన కమిటీని అభినందిస్తూ మాట్లాడుతూ క్రీడల్లో నెట్ బాల్ రాణించాలని జాతీయస్థాయిలో రాణించాలని విద్యతోపాటు క్రీడలను సమానంగా రాణించాలని నెట్ బాల్ క్రీడను స్పోర్ట్స్ కోటాలో వినియోగించుకోవాలని రాజనాల శ్రీహరి కోరారు.



ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈరోజు నెహ్రూ పార్క్ సమీపంలో పోలీస్ శాఖ రవాణా శాఖ సంయుక్తంగా స్కూలు విద్యార్థులతో మానవహారం నిర్మించి రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేపించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో డిసిపి రాజమహేంద్ర నాయక్, ఏసిపి పండరి చేతన్ నితిన్, సీఐ సత్యనారాయణ రెడ్డి డి టి ఓ శ్రీనివాస్ గౌడ్ ఎస్ ఐ చెన్నకేశవులు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బీజేపీ నేత రామకృష్ణారెడ్డి అనుమానాస్పద మృతి...

### బడంగ్‌పేట్ సర్కిల్‌లో అవినీతి బహిర్గతం చేసిన నేత

### 150 కోట్ల స్కామ్ వెలికితీతలో కీలక పాత్ర



**తెహెల్కా రంగారెడ్డి జిల్లా ఏప్రిల్ 15 ప్రతినిధి ఈ.పద్మారావు కాపు:** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం సరూర్‌నగర్ మండలంలోని బడంగ్‌పేట్‌లో విషాదం చోటుచేసుకుంది. బీజేపీ అధ్యక్షుడు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. ప్రజల సమస్యలపై ఎప్పుడూ పోరాడుతూ మంచి పేరు సంపాదించిన ఆయన, బడంగ్‌పేట్ సర్కిల్‌లో అవినీతి అంశాలపై గళమెత్తి సుమారు 150 కోట్ల రూపాయల స్కామ్‌ను వెలుగులోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు. అయితే అకస్మాత్తుగా జరిగిన ఈ మృతి పలు అనుమానాలకు తావు కల్పిస్తోంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## బైరెడ్డి రాజేష్ ఆధ్వర్యంలో చౌకధరల దుకాణం ప్రారంభం.



**తెహెల్కా రంగారెడ్డి జిల్లా ఏప్రిల్ 15 ప్రతినిధి ఈ.పద్మారావు కాపు:** కీసర సర్కిల్, జవహర్ నగర్ జిహెచ్ఎంసి పరిధిలోని డబుల్ బెడ్‌రూమ్ ప్రాంతంలో గౌరవ మండల తహశీల్దార్ బైరెడ్డి రాజేష్ ఆధ్వర్యంలో నూతన చౌకధరల దుకాణం ప్రారంభించబడింది. ఈ కార్యక్రమానికి మండల ఆర్ఐ సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మల్లేపూల శ్రీకాంత్, జవహర్ నగర్ మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస గుప్త, జిల్లా చౌకధరల దుకాణం అధ్యక్షులు బల్లి శ్రీనివాస గుప్త, జవహర్ నగర్ చౌకధరల దుకాణం అధ్యక్షులు నంగునూరి పద్మావతి అశోక్ గుప్త, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కన్నమైన రాజు యాదవ్ తదితర ప్రముఖులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన ప్రతినిధులు, చౌకధరల దుకాణం డీలర్లు మరియు బస్తీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కొత్తగా ప్రారంభమైన ఈ చౌకధరల దుకాణం ద్వారా స్థానిక ప్రజలకు అవసరమైన సరుకులు సులభంగా అందుబాటులోకి రానున్నాయి.

# బంగారం ధరలు

| | | |
|---|---|---|
| హైదరాబాద్ | 1,57,340.00 | 1,56,340.00 |
| ముంబయి | 1,57,270.00 | 1,56,270.00 |
| న్యూఢిల్లీ | 1,56,980.00 | 1,55,980.00 |

# వ్యాపారం

## పెట్టుబడిదారుడు నామినీని నియమించకుండా మరణిస్తే మ్యూచువల్ ఫండ్ పెట్టుబడికి ఏమవుతుంది?




ఒకవేళ పెట్టుబడిదారుడు మరణించి తన ఆస్తులను బదిలీ చేయాలనుకుంటే వారు చట్టబద్ధమైన వారసులని నిరూపించుకోవాలి. వారసత్వ ధృవీకరణ పత్రం వంటి పత్రాలను సమర్పించాల్సి రావచ్చు. ఈ వారసత్వ ధృవీకరణ పత్రం పొందడానికి నెలల సమయం పట్టవచ్చు. అప్పటి వరకు..

ప్రతి ఆర్థిక పథకానికి ఒక నామినీని నియమించడం తప్పనిసరి. బ్యాంకు ఖాతాకు కూడా నామినీని అడుగుతారు. ఎఫ్‌డీ వంటి ఏ పథకానికైనా నామినీని నియమించాలి. అదేవిధంగా మ్యూచువల్ ఫండ్ పెట్టుబడిదారులు, డీమ్యాట్ ఖాతాదారులు కూడా నామినీని నియమించాలి. మీకు నామినీ వద్దు అనుకుంటే దానికి కూడా ఒక అవకాశం ఉంది. సెబీ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం, నామినీ కాలమ్‌ను ఖాళీగా వదిలివేయకూడదు. నామినీని తప్పనిసరిగా నియమించాలి, లేదా నామినీ ఎవరూ లేరని పేర్కొనాలి. పెట్టుబడిదారుడు తెలిసిగానీ, తెలియకగానీ తన మరణానికి ముందు నామినీని నియమించకపోతే మ్యూచువల్ ఫండ్ల పరిస్థితి ఏమిటనే ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది. ఆస్తి యథాతథంగా ఉంటుంది. దానిని పెట్టుబడిదారుడి వారసులకు బదిలీ చేసే అవకాశం ఉంది. ఈ ప్రక్రియ కొంచెం సంక్లిష్టంగా ఉంటుంది. ఇది అంత త్వరగా జరిగే విషయం కాదు. ఒకవేళ పెట్టుబడిదారుడు మరణించి తన ఆస్తులను బదిలీ చేయాలనుకుంటే వారు చట్టబద్ధమైన వారసులని నిరూపించుకోవాలి. వారసత్వ ధృవీకరణ పత్రం వంటి పత్రాలను సమర్పించాల్సి రావచ్చు. ఈ వారసత్వ ధృవీకరణ పత్రం పొందడానికి నెలల సమయం పట్టవచ్చు. అప్పటి వరకు పెట్టుబడి ఆస్తులు యథాతథంగా ఉంటాయి.

నామినీ లేని పక్షంలో వారసులు మరణ ధృవీకరణ పత్రాన్ని సమర్పించాలి. వారు తమ గుర్తింపు పత్రాన్ని, మరణించిన వ్యక్తితో తమకున్న సంబంధాన్ని తెలిపే పత్రాన్ని అందించాలి. వీలునామా ఉన్నట్లయితే దానిని కోర్టు ధృవీకరించాలి. వీలునామా లేనట్లయితే, కోర్టు నుండే వారసత్వ ధృవీకరణ పత్రాన్ని పొందాలి. చిన్న పెట్టుబడుల కోసం, కొన్ని మ్యూచువల్ ఫండ్ కంపెనీలు ఆస్తి బదిలీకి నోటరైజ్డ్ నష్టపరిహార పత్రం (ఇండెమ్నిటీ బాండ్), అఫిడవిట్‌ను అంగీకరించవచ్చు. అయితే పెట్టుబడి మొత్తం పెద్దగా ఉన్నప్పుడు అన్ని చట్టపరమైన ప్రక్రియలను తప్పనిసరిగా పాటించాలి.

## అక్షయ తృతీయకు బంగారం బుక్ చేసుకోవడం మంచి ఆలోచనా?



అక్షయ తృతీయకు బంగారం బుక్ చేసుకోవడం మంచి ఆలోచనా? ాానెంష్ఖుఖు ుతీఅఖు 2026: అక్షయ తృతీయకు ముందే బంగారం, వెండిని బుక్ చేసుకోవడం మంచిదా కాదా అనే ప్రశ్న తలెత్తుతుంది. రిజర్వేషన్ చేసుకోవడం ద్వారా మీరు బంగారాన్ని నేటి ధరకే కొనుగోలు చేయవచ్చు. అందువల్ల అక్షయ తృతీయ రోజున బంగారం ధర పెరిగినా, అది మనపై..

అక్షయ తృతీయ రోజున బంగారం, వెండి మొదలైనవి కొనడం వల్ల మన ఇళ్లకు సంపద వస్తుందని నమ్ముతారు. ఈ కారణంగా ప్రజలు ఆ రోజున తమకు స్తోమత ఉన్నంతగా బంగారంపై పెట్టుబడి పెడుతున్నారు. కానీ 2026లో బంగారం ధర అపూర్వమైన గరిష్ఠ స్థాయికి చేరుకుంది. అందువల్ల ఈ సంవత్సరం బంగారం కొనాలని ఆలోచిస్తున్న వారు చాలా జాగ్రత్తగా ఉండాలి. అమెరికా-ఇరాన్ మధ్య యుద్ధం వంటి అంతర్జాతీయ ఉద్రిక్తతల కారణంగా గత కొన్ని రోజులుగా బంగారం ధర హెచ్చుతగ్గులకు లోనవుతోంది. ఈ నేపథ్యంలో నేడు 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర సుమారు రూ. 1.52 లక్షలకు, 22 క్యారెట్ల బంగారం ధర రూ. 1.39 లక్షలకు అమ్ముడవుతోంది. అదేవిధంగా కిలో వెండి ధర రూ. 2.41 లక్షలకు పెరిగింది.ది కూడా చదవండి: ాజ ాటటవతీ: ఏసీ కొనాలని ఉందా? కేవలం రూ.1 కే కొత్త ఏసీని ఇంటికి తీసుకెళ్లండి.. రిలయన్స్ అదిరిపోయే ఆఫర్లు!

ఈ పరిస్థితిలో అక్షయ తృతీయకు ముందే బంగారం, వెండిని బుక్ చేసుకోవడం మంచిదా కాదా అనే ప్రశ్న తలెత్తుతుంది. రిజర్వేషన్ చేసుకోవడం ద్వారా మీరు బంగారాన్ని నేటి ధరకే కొనుగోలు చేయవచ్చు. అందువల్ల అక్షయ తృతీయ రోజున బంగారం ధర పెరిగినా, అది మనపై పెద్దగా ప్రభావం చూపదు. అదే సమయంలో అక్షయ తృతీయ రోజున బంగారం ధర తగ్గితే మనం ఇప్పటికే రిజర్వేషన్లు చేసుకున్నందున డబ్బును కోల్పోయే అవకాశం ఉంది. ధరల పెరుగుదలను నివారించడానికి అక్షయ తృతీయకు ముందే బుకింగ్ చేసుకోవడం మంచిదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కానీ మార్కెట్ హెచ్చుతగ్గులను కూడా పరిగణనలోకి తీసుకోవడం ముఖ్యం. ప్రీ-ఆర్డర్లు అందించే బంగారు ఆభరణాల దుకాణాల ఆఫర్లను పూర్తిగా నమ్మవద్దు. అక్షయ తృతీయ నాడు బంగారం ధర తగ్గితే, మీరు ఆ ధరకు బంగారం కొనగలరో లేదో నిర్ధారించుకోవడం మంచిది. మీరు కేవలం బంగారం మూల ధరను మాత్రమే చూడకుండా, ఉత్పత్తి రుసుములు, డిజైనింగ్, జీఎస్టీ మొదలైన వాటితో సహా మొత్తం ధర స్పష్టమైన వివరాలను పొందాలి. తక్కువ ధర చూసి మోసపోకండి. హాల్‌మార్క్ ఉన్న ఆభరణాలను మాత్రమే కొనండి. ఇది బంగారం స్వచ్ఛతను నిర్ధారించే ఒక ముఖ్యమైన రుజువు. దుకాణాలు అందించే రిజర్వేషన్ కార్యక్రమాల నియమ నిబంధనలను తప్పకుండా చదవండి.

# క్రీడలు

## అజింక్య రహానేకు 12 లక్షల జరిమానా



కోల్‌కతా నైట్ రైడర్స్ కెప్టెన్ అజింక్య రహానేకు ఫైన్ పడింది. అతనికి 12 లక్షల జరిమానా విధించారు. ఐపీఎల్‌లో మంగళవారం చెన్నై సూపర్ కింగ్స్ తో జరిగిన మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా అతనికి ఫైన్ వేశారు. చెన్నై: కోల్‌కతా నైట్ రైడర్స్ కెప్టెన్ అజింక్య రహానే(ాాయిఅఅెఖు ఘుష్ఖుఅవ)కు ఫైన్ పడింది. అతనికి 12 లక్షల జరిమానా విధించారు. ఐపీఎల్‌లో మంగళవారం చెన్నై సూపర్ కింగ్స్ తో జరిగిన మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా అతనికి ఫైన్ వేశారు. ఈ సీజన్‌లో కోల్‌కతా పర్ఫార్మెన్స్ మరీ దారుణంగా ఉంది. ఇప్పటి వరకు ఆ జట్టు ఒక్క మ్యాచ్ కూడా గెలవలేదు. చెన్నైతో జరిగిన మ్యాచ్‌లో 32 రన్స్ తేడాతో కోల్‌కతా ఓటమి పాలైంది. టాటా ఐపీఎల్‌లో భాగంగా జరిగిన 22వ మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా రహానేకు ఫైన్ వేసినట్లు ఐపీఎల్ మీడియా అడ్వైజరీ ఓ ప్రకటనలో చెప్పింది. ఈ సీజన్‌లో ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.22 కింద తొలిసారి నేరంగా పరిగణిస్తూ ఆ ఫైన్ వేసినట్లు చెప్పారు. శుక్రవారం గుజరాత్ టైటాన్స్‌తో తన తదుపరి మ్యాచ్ కోల్‌కతా ఆడనున్నది.

## చెన్నై చమక్.. కోల్‌కతాపై ఘన విజయం



సూపర్‌కింగ్స్(సీఎస్‌కే) వరస విజయాల జోరు కొనసాగుతున్నది. లీగ్‌లో తొలుత తడబడ్డ చెన్నై ఆ తర్వాత ఢిల్లీ క్యాపిటల్స్‌పై విజయంతో గాడిలో పడింది. మంగళవారం సొంతగడ్డపై జరిగిన పోరులో చెన్నై 32 పరుగుల తేడాతో కోల్‌కతా నైట్‌రైడర్స్‌పై ఘన విజయం సాధించింది. చెన్నై: ఐపీఎల్‌లో మాజీ చాంపియన్ చెన్నై సూపర్‌కింగ్స్(సీఎస్‌కే) వరస విజయాల జోరు కొనసాగుతున్నది. లీగ్‌లో తొలుత తడబడ్డ చెన్నై ఆ తర్వాత ఢిల్లీ క్యాపిటల్స్‌పై విజయంతో గాడిలో పడింది. మంగళవారం సొంతగడ్డపై జరిగిన పోరులో చెన్నై 32 పరుగుల తేడాతో కోల్‌కతా నైట్‌రైడర్స్‌పై ఘన విజయం సాధించింది. దిగ్గజ మహేంద్రసింగ్ ధోనీ గైర్హాజరీలో బరిలోకి దిగిన చెన్నై సమష్టి ప్రదర్శనతో ఆకట్టుకుంది. తొలుత సంజూ శాంసన్ (32 బంతుల్లో 48, 4ఫోర్లు, 3సిక్స్‌లు), డెవాల్డ్ బ్రెవిస్ (29 బంతుల్లో 41, 4ఫోర్లు, 2సిక్స్‌లు) రాణించడంతో చెన్నై 20 ఓవర్లలో 192/5 స్కోరు చేసింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (7) మరోమారు ఘోరంగా నిరాశపర్చగా, గత మ్యాచ్ సెంచరీ హీరో శాంసన్..చెన్నైకి పెద్దదిక్కుగా మారాడు. ఆయూశ్ మాత్రె (17 బంతుల్లో 38, 6ఫోర్లు, 2సిక్స్‌లు)తో కలిసి ఇన్నింగ్స్‌ను నిర్మించాడు. సీఎస్‌కే బ్యాటర్లకు ముకుతాడు వేస్తూ కోల్‌కతా స్పిన్నర్లు సునీల్ నరైన్ (1/21), అనుకూల్ రాయ్ (1/21), వరుణ్ చక్రవర్తి (3-0-26-0) పొదుపు పాటించారు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన కోల్‌కతా 20 ఓవర్లలో 160/7 స్కోరు చేసింది. రమణ్‌దీప్‌సింగ్(35), రోవ్‌మన్ పావెల్(31 నాటౌట్) టాప్‌స్కోరర్‌గా నిలువగా, మిగతావారు బ్యాట్లు ఝులిపించడంలో విఫలమై స్వల్ప స్కోర్లకు పరిమితమయ్యారు. నూర్ అహ్మద్ (3/21), కంబోజ్ (2/26) ధాటికి కోల్‌కతా ఘోరంగా కుదేలైంది. దీంతో ఈ సీజన్‌లో ఐదు మ్యాచ్‌లాడిన కోల్‌కతా నాలుగింటిలో ఓడి కనీసం బోణీ కొట్టలేకపోగా, చెన్నై వరుసగా రెండో విజయంతో ఆకట్టుకుంది. శాంసన్, బ్రెవిస్ రాణించగా : తొలుత టాస్ గెలిచిన కోల్‌కతా. .చెన్నైని బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. లీగ్‌లో విజయమెరుగని కోల్‌కతా అటు బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లో విఫలమవుతూనే ఉన్నది. ఇప్పటికీ సరైన కాంబినేషన్ లేక చేజేతులా మ్యాచ్‌లను వదులుకుంటున్నది. చెన్నైతో మ్యాచ్‌లోనూ అదే సీన్ పునరావృతం అయ్యింది. కెప్టెన్ రుతురాజ్‌ను తక్కువ స్కోరుకే పరిమితం చేశామనుకున్న కోల్‌కతాకు శాంసన్, మాత్రె రూపంలో ప్రతిఘటన ఎదురైంది. లీగ్‌లో సెంచరీతో ఫామ్ అందుకున్న శాంసన్..మాత్రె జతగా కీలక ఇన్నింగ్స్‌కు తెరతీశాడు. వైభవ్ ఇన్నింగ్స్ తొలి ఓవర్ మూడు బంతులను శాంసన్ వరుసగా బౌండరీలు కొట్టి తన ఫామ్‌ను చాటుకున్నాడు. మరో ఎండ్‌లో

# నియోజకవర్గాల పునర్విభజన: పెరగనున్న లోక్‌సభ సీట్లు.. ఎవరికి లాభం? ఎవరికి నష్టం?

నియోజకవర్గాల పునర్విభజన అంశం భారత రాజకీయాల్లో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా మారింది. రేపు అంటే గురువారం, ఏప్రిల్ 16 నుండి ప్రారంభం కానున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో ప్రభుత్వం దీనికి సంబంధించిన కీలక బిల్లులను ప్రవేశపెట్టబోతోంది. ఈ నేపథ్యంలో అసలు ఈ బిల్లుల సారాంశం ఏమిటి? దక్షిణాది రాష్ట్రాలు వీటిని ఎందుకు వ్యతిరేకిస్తున్నాయి? ప్రభుత్వం చెబుతున్న వాదనలేంటి? అనే అంశాలపై ఒక సమగ్ర విశ్లేషణ ఒక్కసారి పరిశీలిద్దాం..

నియోజకవర్గాల పునర్విభజన అంశం భారత రాజకీయాల్లో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా మారింది. రేపు అంటే గురువారం, ఏప్రిల్ 16 నుండి ప్రారంభం కానున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో ప్రభుత్వం దీనికి సంబంధించిన కీలక బిల్లులను ప్రవేశపెట్టబోతోంది. ఈ నేపథ్యంలో అసలు ఈ బిల్లుల సారాంశం ఏమిటి? దక్షిణాది రాష్ట్రాలు వీటిని ఎందుకు వ్యతిరేకిస్తున్నాయి? ప్రభుత్వం చెబుతున్న వాదనలేంటి? అనే అంశాలపై ఒక సమగ్ర విశ్లేషణ ఒక్కసారి పరిశీలిద్దాం..

పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు చారిత్రక మార్పు దిశగా అడుగులు వేస్తోంది. దేశ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చే విధంగా ప్రభుత్వం మూడు ప్రధాన బిల్లులను సభ ముందుకు తీసుకువస్తోంది.రాజ్యాంగ 131వ సవరణ బిల్లు, 2026: దీని ప్రకారం లోక్‌సభ సభ్యుల సంఖ్య ప్రస్తుతమున్న 543 నుండి 850కి పెరుగుతుంది. ఇందులో రాష్ట్రాల నుండి 815 మంది, కేంద్రపాలిత ప్రాంతాల నుండి 35 మంది సభ్యులు ఉంటారు.

డీలిమిటేషన్ బిల్లు, 2026: జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల సరిహద్దులను మార్చడానికి, ఎస్సీ, ఎస్టీ, మహిళలకు రిజర్వేషన్లను ఖరారు చేయడానికి ఒక శక్తివంతమైన 'డీలిమిటేషన్ కమిషన్'ను ఇది ఏర్పాటు చేస్తుంది.

కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల సవరణ బిల్లు, 2026: పెరిగిన సీట్లు, మహిళా రిజర్వేషన్లను కేంద్రపాలిత ప్రాంతాల్లో అమలు చేసేలా ఈ బిల్లు మార్పులు సూచిస్తుంది.

ఈ ప్రతిపాదనలపై తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక వంటి దక్షిణాది రాష్ట్రాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. జనాభాను నియంత్రించి, అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న తమకు, ఈ జనాభా ఆధారిత సీట్ల పెంపు అన్యాయం చేస్తుందని అవి భావిస్తున్నాయి. ప్రధానంగా తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడు సీఎం ఎం.కె. స్టాలిన్ దీనిని రాష్ట్ర ప్రయోజనాలపై దాడి అని అభివర్ణించగా, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఇది దేశ సమాఖ్య వ్యవస్థ సమతుల్యతను దెబ్బతీస్తుందని దేశ ప్రధానికి లేఖ రాశారు. జనాభా నియంత్రణ పాటించని ఉత్తరాది రాష్ట్రాలకు సీట్లు పెరగడం వల్ల, భవిష్యత్తులో దేశ రాజకీయ నిర్ణయాధికారంలో దక్షిణాది రాష్ట్రాల గొంతు నొక్కబడుతుందనేది ప్రధాన ఆందోళన. మాజీ కేంద్ర మంత్రి చిదంబరం గణాంకాలతో వివరిస్తూ, ప్రస్తుత నియోజకవర్గాల మార్పు వల్ల దక్షిణాది రాష్ట్రాల వాటా 24.3% నుండి 20.7%కి పడిపోతుందని హెచ్చరించారు. ఇది ఒక దురుద్దేశపూరిత కుట్ర అని ఆయన విమర్శించారు.



నియోజకవర్గాల పునర్విభజన జరిగితే ప్రధాన రాష్ట్రాల్లో సీట్ల మార్పులు ఈ విధంగా ఉండే అవకాశం ఉంది:

తమిళనాడు ప్రస్తుతం 39 లోక్‌సభ స్థానాలను కలిగి ఉంది. ఒకవేళ నియోజకవర్గాల పునర్విభజన కేవలం 2011 జనాభా లెక్కల ఆధారంగానే జరిగి ఉంటే, దానికి 49 స్థానాలు లభించి ఉండేవి. కానీ, అన్ని రాష్ట్రాల వాటాలను దామాషా పద్ధతిలో 50% మేర పెంచాలన్న భారత ప్రభుత్వ సూత్రం ప్రకారం, ఇప్పుడు దానికి 59 స్థానాలు లభిస్తాయి.

కేరళలో ప్రస్తుతం 20 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. ఒకవేళ నియోజకవర్గాల పునర్విభజన కేవలం 2011 జనాభా లెక్కల ఆధారంగానే జరిగి ఉంటే, దానికి 23 స్థానాలు లభించి ఉండేవి. కానీ, అన్ని రాష్ట్రాల వాటాలను దామాషా పద్ధతిలో 50% మేర పెంచాలన్న భారత ప్రభుత్వ సూత్రం ప్రకారం, ఇప్పుడు దానికి 30 స్థానాలు లభిస్తాయి.ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే, ప్రస్తుతం రాష్ట్రంలో 25 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. ఒకవేళ నియోజకవర్గాల పునర్విభజన కేవలం 2011 జనాభా లెక్కల ఆధారంగానే జరిగి ఉంటే, దానికి 33 స్థానాలు లభించి ఉండేవి. కానీ, అన్ని రాష్ట్రాల వాటాలను దామాషా పద్ధతిలో 50% మేర పెంచాలన్న భారత ప్రభుత్వ సూత్రం ప్రకారం, ఇప్పుడు దానికి 37 స్థానాలు లభిస్తాయి.

తెలంగాణ ప్రస్తుతం 17 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. ఒకవేళ నియోజకవర్గాల పునర్విభజన కేవలం 2011 జనాభా లెక్కల ఆధారంగానే జరిగి ఉంటే, దానికి 24 స్థానాలు లభించి ఉండేవి. కానీ, అన్ని రాష్ట్రాల వాటాలను దామాషా పద్ధతిలో 50% మేర పెంచాలన్న భారత ప్రభుత్వ సూత్రం ప్రకారం, ఇప్పుడు దానికి 25 స్థానాలు లభిస్తాయి.

ఒడిశా ప్రస్తుతం 21 స్థానాలను కలిగి ఉంది. ఒకవేళ నియోజకవర్గాల పునర్విభజన కేవలం 2011 జనాభా లెక్కల ఆధారంగానే జరిగి ఉంటే, దానికి 28 స్థానాలు లభించి ఉండేవి. కానీ, అన్ని రాష్ట్రాల వాటాలను దామాషా పద్ధతిలో 50% మేర పెంచాలన్న భారత ప్రభుత్వ సూత్రం ప్రకారం, ఇప్పుడు దానికి 31 స్థానాలు లభిస్తాయి.

కర్ణాటకలో ప్రస్తుతం 28 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. ఒకవేళ నియోజకవర్గాల పునర్విభజన కేవలం 2011 జనాభా లెక్కల ఆధారంగానే జరిగి ఉంటే, దానికి 41 స్థానాలు లభించి ఉండేవి. కానీ, అన్ని రాష్ట్రాల వాటాలను దామాషా పద్ధతిలో 50% మేర పెంచాలన్న భారత ప్రభుత్వ సూత్రం ప్రకారం, ఇప్పుడు దానికి 42 స్థానాలు లభిస్తాయి. అయితే ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ప్రస్తుతం 80 స్థానాల ఉండగా, గణనీయంగా 140పైగా లోక్‌సభ స్థానాలు పెరిగే అవకాశం కనిపిస్తోంది.

ప్రతిపక్షాల వాదన ప్రకారం, కేవలం జనాభా ఆధారంగా చూస్తే తమిళనాడు సీట్లు తగ్గవచ్చు. కానీ ప్రభుత్వం ప్రతిపాదించిన 'దామాషా పద్ధతి'లో అవి పెరిగినట్లు కనిపిస్తున్నా.. ఉత్తరాదితో పోలిస్తే దక్షిణాది ప్రాబల్యం తగ్గుతుందనేది వారి అసలు పాయింట్. ప్రతిపక్షాల ఆరోపణలను కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తోసిపుచ్చారు. 1971 జనాభా లెక్కల ఆధారంగా ఉన్న వ్యవస్థ ఇప్పుడు కాలం చెల్లిందని ప్రభుత్వం వాదిస్తోంది. ప్రతి ప్రాంతానికి, ప్రతి వర్గానికి మేలు జరిగేలా ఈ బిల్లులను రూపొందించామని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. జనాభా అదుపులో ఉన్న దక్షిణాది రాష్ట్రాలకు కూడా సీట్లు పెరుగుతాయని, కాబట్టి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కిరణ్ రిజిజు స్పష్టం చేశారు. మహిళలకు 33% రిజర్వేషన్లు అమలు కావాలంటే డీలిమిటేషన్ ప్రక్రియ తప్పనిసరి అని, 15 ఏళ్ల పాటు ఈ రిజర్వేషన్లు కొనసాగుతాయని ప్రభుత్వం గుర్తు చేస్తోంది. పెరిగిన జనాభాకు అనుగుణంగా ప్రజల సమస్యలను సభలో వినిపించడానికి సభ్యుల సంఖ్య పెరగడం ప్రజాస్వామ్యానికి అవసరమని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది.

సోనియా గాంధీ వంటి అగ్రనేతలు సైతం రాజకీయ ప్రాతినిధ్యంలో వచ్చే ఈ పెనుమార్పులు రాజ్యాంగ సూత్రాలను దెబ్బతీస్తాయని హెచ్చరిస్తున్నారు. కేవలం జనాభా ప్రాతిపదికన కాకుండా, అభివృద్ధిని కూడా పరిగణనలోకి తీసుకోవాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. గురువారం నుండి జరగబోయే ఈ మూడు రోజుల సమావేశాలు కేవలం బిల్లుల ఆమోదానికే పరిమితం కాకుండా, ఉత్తర-దక్షిణ భారత రాష్ట్రాల మధ్య నెలకొన్న రాజకీయ, ఆర్థిక అసమానతలపై చర్చకు వేదిక కానున్నాయి. ప్రభుత్వం ఈ ఆందోళనలను ఎలా శాంతింపజేస్తుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# అమర్‌నాథ్ యాత్ర రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం- ఎక్కడ? ఎలా చేసుకోవాలో తెలుసా?

: హిందువుల అత్యంత పవిత్ర యాత్రల్లో ఒకటైన అమర్‌నాథ్ యాత్ర 2026 కోసం నమోదు ప్రక్రియ బుధవారం నుంచి అధికారికంగా ప్రారంభమైంది. కశ్మీర్ హిమాలయాల్లో జరిగే ఆ యాత్ర 2026 జులై 3వ తేదీన ప్రారంభమై ఆగస్టు 28 వరకు కొనసాగునుంది. ప్రతి ఏడాది లాగానే ఈసారి కూడా లక్షలాది భక్తులు పాల్గొననున్నారని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఆన్‌లైన్ ద్వారా నమోదు సదుపాయం

ఈ సంవత్సరం యాత్రకు నమోదు ప్రక్రియ మరింత సులభతరం చేయడానికి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండు విధానాలను అందుబాటులో ఉంచారు. భక్తులు శ్రీ అమర్‌నాథ్ శ్రైన్ బోర్డ్ అధికార వెబ్‌సైట్ ద్వారా ఆన్ లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. అదే విధంగా దేశవ్యాప్తంగా 550కి పైగా గుర్తింపు పొందిన బ్యాంక్ శాఖల్లో కూడా నమోదు సదుపాయం కల్పించారు. ఇందులో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, యెస్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఈసీఈసీ బ్యాంక్‌లు ఉన్నాయి.





Amarnath Yatra Registration Process

అమర్‌నాథ్ యాత్ర రిజిస్ట్రేషన్ ప్రాసెస్ కోసం వచ్చిన భక్తులు (జుుం దీష్ఘుతీఫ్)

ముందస్తు నమోదు అవసరం

యాత్రలో పాల్గొనే భక్తులు వీలైనంత త్వరగా నమోదు పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు. ఎంపిక చేసిన యాత్ర వివరాలు తేదీకి ఏడు రోజుల ముందుగానే మూసివేస్తారని తెలిపారు. నమోదు పూర్తయిన భక్తులకు సిస్టమ్ ద్వారా యాత్రా పర్మిట్ పత్రం అందుతుందని అన్నారు. దానిలో తేదీ, ఎంచుకున్న మార్గం, ప్రవేశ సమయం వంటి వివారాలు స్పష్టంగా ఉంటాయి.

Amarnath Yatra Registration Process

అమర్‌నాథ్ యాత్ర రిజిస్ట్రేషన్ ప్రాసెస్ కోసం వచ్చిన మహిళ (జుుం రక్షణ కోసం ప్రత్యక ఏర్పాట్లు అంతే కాకుండా ఈ సంవత్సరం భద్రతా చర్యలు కట్టుదిట్టంగా మార్చారని తెలిపారు. అందులో భాగంగా యాత్ర సమయంలో యాత్రికుల కదలికలను పర్యవేక్షించేందుకు వీలుగా ప్రతి వ్యక్తికి ఆర్ఎఫ్ ఐడీ(రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్) కార్డులు జారీ చేస్తారని చెప్పారు. యాత్రను సురక్షితంగా, క్రమబద్ధంగా నిర్వహించేందుకు వీలుగా యాత్రికలు వైద్య పరీక్ష చేయించుకుని, తప్పనిసరి వైద్య ఫారాలను సమర్పించాలని కూడా పరిపాలన యంత్రాంగం ఆదేశించింది.

అమర్‌నాథ్ యాత్ర భారతదేశంలోని అత్యంత ముఖ్యమైన మతపరమైన యాత్రలలో ఒకటి. ఇక్కడ లక్షలాది మంది భక్తులు సహజంగా ఏర్పడిన మంచు శివలింగాన్ని దర్శించుకోవడానికి కష్టతరమైన పర్వత మార్గాల గుండా ప్రయాణిస్తారు. ఈ ఏడాది యాత్ర జూలై 3 నుంచి ప్రారంభమై, మొత్తం 57 రోజుల పాటు కొనసాగనుంది. అంటే ఆగస్టు 28న రక్షా బంధన్ సందర్భంగా ముగియనుంది.

Amarnath Yatra Registration Processఅమర్‌నాథ్ యాత్ర రిజిస్ట్రేషన్ ప్రాసెస్ కోసం బ్యాంక్‌కు వచ్చిన భక్తులు అమర్‌నాథ్ యాత్రకు ఎలా నమోదు చేసుకోవాలి?

యాత్రకు వెళ్లాలని అనుకునేవారందరికీ అధికారులు రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరి చేశారు. భక్తులు రెండు అధికారిక పద్ధతుల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు : శ్రీ అమరనాథ్‌జీ ష్రైన్ బోర్డ్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ నమోదుచెల్లుబాటు అయ్యే ప్రయాణ అనుమతిని పొందే ముందు దరఖాస్తుదారులు వ్యక్తిగత వివరాలు, పత్రాలు సమర్పించి, ధ్రువీకరణను పూర్తి చేయాలి. ఈ అనుమతి లేకుండా, పుణ్యక్షేత్ర మార్గంలోకి ప్రవేశం అనుమతి లేదు.

అర్హత, ఆరోగ్య అవసరాలు ఏమిటి?

వయోపరిమితి: 13 నుంచి 70 సంవత్సరాలు

తప్పనిసరి ఆరోగ్య ధృవీకరణ పత్రం (సీహెచ్‌సీ)

ప్రయాణ తేదీకి దగ్గరలో వైద్య ధ్రువీకరణ పత్రం జారీ చేయాలి.అమర్‌నాథ్ యాత్ర 2026 రిజిస్ట్రేషన్ చివరి తేదీ

అమర్‌నాథ్ యాత్ర 2026 రిజిస్ట్రేషన్ కోసం చివరి తేదీని ఇంకా అధికారికంగా నిర్ణయించలేదు. కానీ కోటా సీట్లు నిండిపోయే వరకు లేదా యాత్ర ముగియడానికి కొన్ని రోజుల ముందు వరకు ఇది సాధారణంగా తెరిచి ఉంటుంది.

యాత్ర ప్రారంభం: 2026 జూలై 3వ తేదీ

అంచనా ముగింపు: ఆగస్టు 2026 చివరిలో!

రోజువారీ కోటా నిండిన తర్వాత రిజిస్ట్రేషన్ మూసివేస్తారు. (పరిమిత-సీట్ల విధానం)

## భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో నారీశక్తి వందన్ భారీ మహా ర్యాలీ.



**యాదాద్రి భువనగిరి. తేహెల్క న్యూస్:**భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా జిల్లాఅధ్యక్షురాలు మాధురి చంద్ర ఆధ్వర్యంలో నారీశక్తి వం దన్ అధినియం (మహిళా రిజర్వే షన్ బిల్లు)కు మద్దతుగా భారీ ర్యాలీ నిర్వహించడం జరిగింది.

సెప్టెంబర్ 2023లో ఆమోదించబ డిన నారీశక్తి వందన్ అధినియం ద్వారా లోక్‌సభ మరియు రాష్ట్ర అసెంబ్లీలలో మహిళలకు 33% సీట్ల రిజర్వేషన్ కల్పించబడింది. ఈ చారిత్రాత్మక చట్టం మహిళా సాధికారతను పెంపొందిస్తూ, రా జకీయ రంగంలో మహిళల ప్రాతి నిధ్యాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయ శ్రీ గారు పేర్కొన్నారు.

అలాగే,వికసిత భారత్ నిర్మాణం లో మహిళల పాత్ర మరింత బల పడుతుందని ఆమె అన్నారు.

ఈ బిల్లును స్వాగతిస్తూ ఈ రోజు భువనగిరి జిల్లా కేంద్రంలో గాంధీ పార్క్ నుండి వినాయక చౌరస్తా వరకు మహార్యాలీ ఘనంగా నిర్వ హించబడింది.

ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఊట్కూరి అశోక్ గౌడ్,జనగాం జి ల్లా అధ్యక్షులు చౌడ రమేష్ నారీ శక్తి వందన్ అధినియం టోలి కో- కన్వీనర్ వైజయంతి,పట్నం కపిల్, కౌన్సిలర్స్ వంగేటి సుచరిత రెడ్డి, బండారు స్వర్ణలత,తుమ్మల యా స్మిన్,బోజని శారద,కర్రె మాధవి, పట్నం రోజా,నల్లమాసు సుమ, జనగాం కవిత,అరుణజ్యోతి,అడ్వ కేట్ వెన్నెల,ఇండ్లసత్యవతి, మహి ళా మోర్చానాయకురాళ్లు మాధవి ఎంజాల మల్లికా,రాణి,మందుల లక్ష్మి,అక్షిత,ఆరుట్ల స్వాతి,నూకల ఉమారాణి,బొట్టు స్వప్న,కళ్యాని, జీవన జ్యోతి,సరిత,శ్రీదేవి,శ్వేతా రెడ్డి,రజిని నారాయణ యాదవ్, వివిధ రంగాల్లో ఉన్న మహిళలు పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్ను ప్రారంభించిన మంత్రాలయం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి ఎన్.రాఘవేంద్ర రెడ్డి





**మంత్రాలయం తెహెల్కాన్యూస్:** మంత్రాలయం నియోజకవర్గ పరిధిలోని కోసిగి పట్టణంలో నూతనంగా ప్రారంభించిన అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ, మంత్రాలయం టీడీపీ ఇన్చార్జి ఎన్.రాఘవేంద్ర రెడ్డి, మంత్రాలయం సొసైటీ చైర్మన్ ఎన్.రామకృష్ణ రెడ్డి, జనసేన ఇన్చార్జి లక్ష్మన్న, బిజెపి ఇన్చార్జి విష్ణువర్ధన్ రెడ్డి ముఖ్య అతితులుగా పాల్గొని అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. అనంతరం పేద ప్రజలకు ₹5కే భోజనం అందజేశారు.ఈ సందర్భంగా టిడిపి ఇంచార్జి ఎన్ రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతు

మాన్య శ్రీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ నుంచి 62 కొత్త అన్న క్యాంటీన్లు ప్రారంభం కానున్నాయని తెలిపారు. అన్న క్యాంటీన్లు పేదలకు అన్నం పెట్టేవిగా తయారు అవడం, మారు మూల గ్రామం అయినా కోసిగి లో ప్రారంభించిడం చాలా సంతోషంగా ఉందని, కోసిగి ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 180 మంది అమ్మాయిల 350 వీడియోలు తీసి.! ఆ తర్వాత.. ఆపై బ్లాక్‌మెయిల్

ప్రేమ పేరుతో అమ్మాయిలకు వల.. నమ్మించి మోసం.. ఆపై బ్లాక్‌మెయిల్ చేస్తూ లైంగిక దాడులు. ఇది ఏ ఒకరో ఇద్దరో అమ్మాయిల వ్యధ కాదు.. ఏకంగా 108 మంది యువతులు ఈ ఉచ్చులో చిక్కుకున్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి సోషల్ మీడియాలో 350కి పైగా అశ్లీల వీడియోలు వైరల్ అవుతున్నాయి.మహారాష్ట్రలోని అమరావతి జిల్లా పరతవాడలో మహమ్మద్ అయాన్ మహమ్మద్ తన్వీర్ అనే యువకుడు యువతులను ప్రేమ పేరుతో వలలో వేసుకుని బ్లాక్‌మెయిల్ చేస్తూ లైంగిక దాడులకు పాల్పడ్డాడు. అతని వలపు వలలో చిక్కుకుని దాదాపు 108 మంది అమ్మాయిల జీవితం ప్రశ్నార్థకంగా మారింది. ఇది రాష్ట్రంలోనే కాదు.. దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అయితే ఇక్కడే మరో ట్విస్ట్.. సంచలనం సృష్టిస్తున్న ఈ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో హుజేర్ ఖాన్ ఇక్బాల్ ఖాన్(20 సంవత్సరాలు) అనే యువకుడిని మరో నిందితుడిగా చేర్చారు. ఇప్పటివరకు పోలీసులు ఈ కేసుకు సంబంధించి 18 వీడియోలు, 39 ఫోటోలు స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటికే ఇందులో బలైపోయిన అమ్మాయిలు 180 మంది అని పోలీసులు చెబుతుండగా.. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశముందని భావిస్తున్నారు. సోషల్ మీడియాలో 350కి పైగా అశ్లీల వీడియోలు వైరల్ అయ్యాయి. ఈ వీడియోల్లో అనేకమంది అమ్మాయిలతో అసభ్యకర దృశ్యాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో మరో దారుణమైన విషయం ఏంటంటే.. ఈ 180 మంది యువతులతో పాటు కొందరు మైనర్ బాలికలు కూడా ఉండి ఉండవచ్చని సమాచారం.సోషల్ మీడియాలో వీడియోలు పెద్దఎత్తున వైరల్ కావడంతో పోలీసులు ఈ కేసును సవాలుగా తీసుకున్నారు. బాధిత యువతులు చేస్తున్న ఆరోపణల ప్రకారం.. నిందితుడు ముందుగా ప్రేమ పేరుతో యువతులను దగ్గర చేసుకుని, తర్వాత వారితో లైంగిక సంబంధాలు పెట్టుకుని వాటిని రహస్యంగా వీడియోగా చిత్రీకరించేవాడు. అనంతరం ఆ వీడియోలను చూపిస్తూ వారిని బ్లాక్‌మెయిల్ చేసేవాడు. ఈ వీడియోలను ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్‌తో పాటు వివిధ సోషల్ మీడియా ప్లాట్‌ఫారంలలో పెట్టి బెదిరించేవాడు. ఇంతటి దారుణానికి పాల్పడి, ఎందరో అమ్మాయిల జీవితాలను ఇరకాటంలో పెట్టిన మహమ్మద్ అయన్ మహమ్మద్ తన్వీర్‌ను సోమవారం రాత్రి అమరావతి పోలీసులు అరెస్టు చేశారు. [illegible] సహా పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. మంగళవారం స్థానిక కోర్టులో హాజరుపరిచిన తన్వీర్‌కు ఏడు రోజుల పోలీసు కస్టడీ విధించారు. అంతేకాకుండా ఈ వీడియోలు ఎలా పెద్ద ఎత్తున వైరల్ అయ్యాయో తెలుసుకునేందుకు సంబంధిత నెట్‌వర్క్‌పై కూడా విచారణ చేపడుతున్నారు.నిందితుడు తన్వీర్ నుంచి మొబైల్ ఫోన్ మరియు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

PRINTED,PUBLISHED, OWNED BY TEHELKA MEDIA NETWORK , DIGITAL NEWS .Regd no : 2019/ 28814 ,EDITOR: K.CHANDRA SHEKHAR,
EXCUTIVE EDITOR : K. SRINIVAS RAO,G6,Madhuranagar,yousufguda,HYDERABAD-500045.e-mail:Tehelkamedianetworks@gmail.com